PRGI Reg No -“APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...


ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 33, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 24 - మార్చి - 2026 , వెల రూ.5/-

## అదే జరిగితే సీమైన్స్ పెడతాం: అమెరికాకు ఇరాన్ గట్టి వార్నింగ్




అగ్రరాజ్యం భూతల దాడులకు దిగే అవకాశముంది

ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోచ్చనే ప్రచారం సాగుతోంది

## హర్మూజ్ మీదుగా వెళ్లే నౌకలపై టోల్ ఛార్జీ... స్పందించిన భారత్‌లోని ఇరాన్ ఎంబసీ




ఫీజులకు సంబంధించి తమ అధికారులు ఎవరూ ఎటువంటి ప్రకటన చేయలేదు

కొందరు వ్యక్తులు చెప్పిన వ్యక్తిగత అభిప్రాయాన్ని ఇరాన్‌కు ఆపాదించారు

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం




5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నాం

రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయి



## ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే
# రైతుభరోసా ఇస్తున్నారు
### హరీశ్ రావు ఆగ్రహం

- గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చింది
- ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారు
- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఒక్క సీజన్‌కే ఇస్తున్నారు మిగతా..2లో




## అసెంబ్లీలో ‘బియ్యం‘ రాజకీయం: ఎగుమతులపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు.. దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!

- వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్న
- ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు

## ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో
# మరో కీలక ముందడుగు
### పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం

- ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు.. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్
- రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం
- ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది
- దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది







అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా మిగతా..2లో

## పశ్చిమాసియా సంక్షోభంతో భారత్‌కు ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి
### ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

- వ్యూహాత్మక చర్యలతో పెరిగిన ఇంధన భద్రత
- పరిస్థితులు ఆందోళనకంగా ఉన్నాయి
- ప్రవాస భారతీయుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం



ఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా భారత్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ యుద్ధం గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై, దేశ వాణిజ్యంపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంపై విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇప్పటికే సభకు వివరించారని మిగతా..2లో

## విజయమ్మ లేఖ నిజం.. దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి
### దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలి

- ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం
- విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి
- దమ్ముంటే జగనే మాట్లాడాలి




అమరావతి: తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి మిగతా..2లో

### ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే
# రూ. 4,571 కోట్లు ఉంది

- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన మల్లు భట్టి విక్రమార్క
- గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చెల్లిస్తాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టింది
- రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, వాటిని కూడా త్వరలోనే




హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఏ బకాయిల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మిగతా..2లో

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక
# జోన్లుగా విభజిస్తున్నాం
### ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తాం

- పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం
- ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం
- శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు
- కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుంది



హైదరాబాద్: పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. మిగతా..2లో



## ఆ 30 నిమిషాల జూమ్ కాల్ ఏపీ తలరాతనే మార్చేసింది: నారా లోకేశ్

- ఈ భూమిపూజ కేవలం ఒక పరిశ్రమకు శంకుస్థాపన కాదు
- ఆంధ్రప్రదేశ్ పై, భారతదేశంపై ఉన్న నమ్మకానికి నిదర్శనం
- “2019 జనవరిలో దావోస్‌లో ఆదిత్య మిట్టల్‌ను కలవడానికి ప్రయత్నించాను
- “తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క రోజు కూడా వృథా చేయకుండా వేగంగా పనులు ప్రారంభించాం మిగతా..2లో




## గ్యాస్ సంక్షోభానికి చెక్... ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి
- గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలి
- ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలి
- రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారు

## హర్మూజ్ మీదుగా వెళ్లే నౌకలపై టోల్ ఛార్జీ...
# స్పందించిన భారత్‌లోని ఇరాన్ ఎంబసీ

ఢిల్లీ: హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే నౌకల నుంచి 2 మిలియన్ డాలర్ల చొప్పున టోల్ ఫీజు విధించనున్నట్లు వస్తున్న వార్తలపై భారతదేశంలోని ఇరాన్ ఎంబసీ స్పందించింది. ఈ ప్రచారాన్ని ఇరాన్ దౌత్య కార్యాలయం ఖండించింది. ఫీజులకు సంబంధించి తమ అధికారులు ఎవరూ ఎటువంటి ప్రకటన చేయలేదని స్పష్టం చేసింది. కొందరు వ్యక్తులు చెప్పిన వ్యక్తిగత అభిప్రాయాన్ని ఇరాన్‌కు ఆపాదించారని తెలిపింది. ఈ మేరకు భారతదేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. కొంతమంది చెప్పిన వ్యక్తిగత అభిప్రాయాలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి నిరాధారమైన వార్తలను ఎవరూ విశ్వసించవద్దని పేర్కొంది. వ్యక్తిగత అభిప్రాయాలతో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు సంబంధం లేదని తెలిపింది. హర్మూజ్ మీదుగా వెళ్లే నౌకల నుంచి 2 మిలియన్ డాలర్ల చొప్పున టోల్ ఫీజు వసూలు చేయనున్నట్లు ఇరాన్ పార్లమెంట్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యుడు అలాయుద్దీన్ బరూజెర్దిని ప్రకటించారని స్థానిక మీడియాలో వార్తలు వచ్చాయి. యుద్ధం కారణంగా ఖర్చులు పెరగడంతో ఈ ఛార్జీలు వసూలు చేయాల్సి వస్తోందని తెలిపింది.

## అదే జరిగితే సీమైన్స్ పెడతాం: అమెరికాకు ఇరాన్ గట్టి వార్నింగ్

ఢిల్లీ: అమెరికాకు ఇరాన్ మరోసారి గట్టి వార్నింగ్ ఇచ్చింది. అగ్రరాజ్యం భూతల దాడులకు దిగే అవకాశముందని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ తీరం లేదా ద్వీపాలపై దాడి చేస్తే పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ పరుస్తామని ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. దీనితో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగవచ్చని రాయిటర్స్ కథనం పేర్కొంది. తమ తీరం నుంచే పర్షియన్ గల్ఫ్ ప్రాంత జలాల్లోకి సీమైన్స్ ప్రవేశపెట్టగలమని ఇరాన్ హెచ్చరించింది. దీనితో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా హర్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితి ఉంటుందని పేర్కొంది. 1980లలో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన విషయం మరిచిపోకూడదని ఇరాన్ గుర్తు చేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ప్రాంతం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో ఖర్గ్‌ను ఆక్రమిస్తే ఇరాన్‌పై ఒత్తిడి తేవచ్చని అమెరికా భావిస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే 4,500 మంది సెయిలర్లు, మెరైన్లను అమెరికా మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్-35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికిల్స్‌తో కూడిన బెటాలియన్‌ను కూడా పంపించింది.

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం
## డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు. "గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## ఆ 30 నిమిషాల జూమ్ కాల్
## ఏపీ తలరాతనే మార్చేసింది: నారా లోకేశ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా రాజయ్యపేట వద్ద ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఈ ప్రాజెక్టును సాధించడం వెనుక ఉన్న సుదీర్ఘ ప్రయాణాన్ని, పట్టుదలను వివరిస్తూ భావోద్వేగ ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు హెచ్.డి. కుమారస్వామి, శ్రీనివాస వర్మ, ఆర్సెలర్ మిట్టల్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఈ భూమిపూజ కేవలం ఒక పరిశ్రమకు శంకుస్థాపన కాదని, ఇది ఆంధ్రప్రదేశ్ పై, భారతదేశంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఈ ప్రాజెక్టు వెనుక ఉన్న తన ప్రయత్నాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "2019 జనవరిలో దావోస్‌లో ఆదిత్య మిట్టల్‌ను కలవడానికి ప్రయత్నించాను. కానీ ఆయన నాకు సమయం ఇవ్వలేదు. అయినా పట్టువదలలేదు. టాటా గ్రూప్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన్ను కలిసి, ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు పెట్టుబడి పెట్టకూడదని అడిగాను. అప్పటికే తాము ఇతర రాష్ట్రాలను పరిశీలిస్తున్నామని ఆయన వినయంగానే అయినా నిక్కచ్చిగా చెప్పారు. అయినా నేను పట్టుదలతో, ఒకవేళ మీ ప్రాజెక్టు అక్కడ కార్యరూపం దాల్చకపోతే, ఆంధ్రప్రదేశ్ మీకోసం సిద్ధంగా ఉంటుందని చెప్పాను. అది కేవలం ఆత్మవిశ్వాసం కాదు, మాకున్న దృఢ సంకల్పం" అని లోకేశ్ వివరించారు. సంవత్సరాలు గడిచాయని, 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తమ కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుత విజయాన్ని అందించి, మరోసారి సేవ చేసే అవకాశం కల్పించారని లోకేశ్ తెలిపారు. "తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క రోజు కూడా వృథా చేయకుండా వేగంగా పనులు ప్రారంభించాం. 2024 సెప్టెంబర్ 22, ఆదివారం రాత్రి 8:30 గంటలకు ఆదిత్య మిట్టల్‌తో నేను చేసిన 30 నిమిషాల జూమ్ కాల్, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును శాశ్వతంగా మార్చివేసిందని నేను నమ్ముతున్నాను. ఆ కాల్ ఫలితంగానే, భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ పెట్టుబడులలో ఒకదాన్ని మనం సాధించగలిగాం. ఇదే వ్యాపార సౌలభ్యం అంటే.. ఇదే నూతన ఆంధ్రప్రదేశ్" అని లోకేశ్ గర్వంగా ప్రకటించారు. తన పాదయాత్ర అనుభవాన్ని పంచుకుంటూ, "2023లో రాష్ట్రవ్యాప్తంగా 3,132 కిలోమీటర్ల పాదయాత్ర చేశాను. గంగాధర నెల్లూరులో మోహన అనే రోడ్డు పక్కన బజ్జీలు అమ్ముకునే మహిళను కలిశాను. ఆమె గత 30 ఏళ్లుగా అక్కడే బజ్జీలు అమ్ముతూ, భర్తను మద్యానికి కోల్పోయినా, సంపాదించిన ప్రతి రూపాయిని కూడబెట్టి ఇద్దరు పిల్లలను చదివించింది. 'మీకు నేనేం చేయాలి?' అని అడిగితే, 'నాకు సంక్షేమ పథకాలు వద్దు, నా పిల్లలకు ఉద్యోగాలు కల్పించండి, చాలు' అని ఆమె చెప్పిన మాట నా ప్రయాణమంతా నన్ను వెంటాడింది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని మేం ఇచ్చిన హామీకి ఆ తల్లే స్ఫూర్తి" అని లోకేశ్ భావోద్వేగంగా చెప్పారు. ఈ భూమిపూజ కార్యక్రమం తనకు చాలా ప్రత్యేకమని, ఆంధ్రప్రదేశ్ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోగలుగుతున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. "కఠోర శ్రమ, పట్టుదల, నమ్మకం వల్లే ఇది సాధ్యమైంది. ఇప్పుడు మనం ఇప్పటికే స్థిరపడిన రాష్ట్రాలతో పోటీ పడుతూ, దేశంలోనే నంబర్ వన్ పెట్టుబడుల గమ్యస్థానంగా మారాం. ప్రపంచ స్థాయి కార్పొరేట్లను ఆకర్షించి, రికార్డు సమయంలో భూములు అప్పగించి, ప్రాజెక్టులు ప్రారంభించే మా సామర్థ్యానికి ఈ భూమిపూజే నిదర్శనం. అత్యాధునిక టెక్నాలజీ, హై-గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిలో ప్రత్యేకత కలిగిన ఈ స్టీల్ ప్లాంట్ రాష్ట్రానికి వస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఒకటి" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా ఇస్తున్నారు
## హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్: ఏవైనా ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన శాసనసభలో మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని అన్నారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఒక్క సీజన్‌కే ఇస్తున్నారని ఆరోపించారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. గత రెండు బడ్జెట్‌లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారని గుర్తు చేశారు. కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పి గత బడ్జెట్‌లో చెప్పి ఈసారి ఆ ప్రస్తావన కూడా తేలేదని విమర్శించారు.

## అసెంబ్లీలో 'బియ్యం' రాజకీయం: ఎగుమతులపై
## హరీశ్ రావు సంచలన ఆరోపణలు..
## దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!

హైదరాబాద్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు. ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## పశ్చిమాసియా సంక్షోభంతో భారత్‌కు
# ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి

ఇప్పటికే సభకు వివరించారని గుర్తుచేశారు. ఈ సంక్షోభానికి త్వరగా పరిష్కారం కనుగొనాలని ప్రపంచ దేశాలన్నీ కోరుకుంటున్నాయని తెలిపారు.

ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్, ఎరువులు వంటివి పెద్ద మొత్తంలో హర్మూజ్ జలసంధి నుంచే వస్తాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. యుద్ధం కారణంగా ఈ మార్గంలో నౌకల రాకపోకలు సవాలుగా మారాయని అన్నారు. "అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా మా ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది" అని ఆయన వివరించారు. దేశం తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని దేశీయ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచుతున్నట్లు చెప్పారు.

వ్యూహాత్మక చర్యలతో పెరిగిన ఇంధన భద్రత

గత 11 ఏళ్లలో ఇంధన భద్రత కోసం తమ ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యలను ప్రధాని మోదీ వివరించారు. గతంలో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ వంటివి దిగుమతి చేసుకోగా, నేడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయికి చేరామని తెలిపారు. సంక్షోభ సమయాల కోసం ముడి చమురు నిల్వలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని 64 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెంచేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి కాకుండా ఆయిల్ కంపెనీల వద్ద ఉండే నిల్వలు అదనమని అన్నారు. చమురు, గ్యాస్ సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా వివిధ దేశాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, గల్ఫ్, ఇతర సముద్ర మార్గాలను నిశితంగా గమనిస్తున్నామని మోదీ పేర్కొన్నారు.

పరిస్థితులు ఆందోళనకంగా ఉన్నాయి

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభం భారత్‌కు ఆర్థిక, జాతీయ భద్రత, మానవతా పరమైన సవాళ్లను సృష్టిస్తోందని వివరించారు. "యుద్ధంలో చిక్కుకున్న దేశాలతో, దాని ప్రభావానికి గురైన దేశాలతో భారత్‌కు విస్తృతమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. మనకు అవసరమైన ముడి చమురు, గ్యాస్‌లో సింహభాగం ఈ ప్రాంతం నుంచే దిగుమతి అవుతోంది. ఇతర దేశాలతో మన వాణిజ్యానికి ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన మార్గం కూడా. అందువల్ల, ఈ యుద్ధం మనపై తీవ్ర ప్రభావం చూపుతోంది" అని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సుమారు కోటి మంది భారతీయులు నివసిస్తూ, పనిచేస్తున్నారని, అలాగే వాణిజ్య నౌకల్లో పనిచేసే భారత సిబ్బంది సంఖ్య కూడా చాలా ఎక్కువని, ఈ కారణాల వల్ల భారత్ ఆందోళన సహజంగానే ఎక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

ప్రవాస భారతీయుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం

సంక్షోభ ప్రాంతాల్లోని భారతీయుల భద్రత, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రభావిత దేశాల్లోని ప్రతి భారతీయుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాం. నేను స్వయంగా రెండు దఫాలుగా చాలా పశ్చిమాసియా దేశాల అధినేతలతో ఫోన్‌లో మాట్లాడాను. భారతీయులకు పూర్తి భద్రత కల్పిస్తామని వారంతా హామీ ఇచ్చారు" అని తెలిపారు. దురదృష్టవశాత్తు కొందరు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని చెబుతూ, వారి కుటుంబాలకు అవసరమైన మద్దతు అందిస్తున్నామని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తున్నామని వివరించారు.

ఇప్పటికే 3,75,000 మందికి పైగా భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని, ఒక్క ఇరాన్ నుంచే 700 మంది మెడికల్ విద్యార్థులతో సహా వెయ్యి మంది వచ్చారని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని భారతీయ పాఠశాలల్లో 10, 12వ తరగతి పరీక్షలను సీబీఎస్ఈ రద్దు చేసిందని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

### రైతులపై ప్రభావం పడకుండా చర్యలు

పశ్చిమాసియా సంక్షోభం రైతులపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. "రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు దేశంలో పుష్కలంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. గత కొన్నేళ్లుగా మేం తీసుకున్న చర్యల వల్ల వివిధ మార్గాల్లో ఎరువుల దిగుమతి సాధ్యమైంది. రైతులకు 'మేక్ ఇన్ ఇండియా' ఎరువుల ప్రత్యామ్నాయాన్ని కూడా ఇచ్చాం" అని ఆయన వివరించారు. డీజిల్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు రైతులకు 22 లక్షలకు పైగా సోలార్ పంపులను అందజేసినట్లు గుర్తుచేశారు.

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రత్యామ్నాయాలు

ఇలాంటి క్లిష్ట సమయాల్లో ఇథనాల్ బ్లెండింగ్‌పై భారత్ దృష్టి సారించడం సత్ఫలితాలనిస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. "ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా మనం ఇప్పుడు ఏటా 4.5 కోట్ల బ్యారెళ్ల చమురు దిగుమతిని ఆదా చేస్తున్నాం" అని వెల్లడించారు. ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలకు 15,000 ఈ-బస్సులను అందజేశామని తెలిపారు. పశ్చిమాసియా ఇంధన అవసరాలకు ప్రధాన వనరు అయినప్పటికీ, అక్కడి అంతరాయాల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా బలంగా ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రసాయనాలు, ఫార్మా, పెట్రోకెమికల్స్ వంటి రంగాలకు అవసరమైన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ వనరులను అన్వేషిస్తున్నట్లు, అలాగే భారతీయ వస్తువులను ప్రోత్సహించడానికి కొత్త ఎగుమతి మార్గాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

## గ్యాస్ సంక్షోభానికి చెక్... ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

అమరావతి: రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు. నిలిచిపోయిన శ్రీకాకుళం - కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు.

### పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక

అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస

టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యే నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తిరుమలలో క్యూలైన్ల నిర్వహణ మెరుగుపడిందని, భక్తుల నిరీక్షణ సమయం తగ్గి దాదాపు 20 శాతం అదనపు దర్శనాలు సాధ్యమయ్యాయని వివరించారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ప్రసాదం నాణ్యత పెరిగిందని, భక్తులు, శ్రీవారి సేవకుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన శాఖలు కూడా మెరుగైన ప్రజా సేవల కోసం ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచేలా చూడాలని, ఇందుకు పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచాలని, ప్రభుత్వ శాఖలు డేటాను సమర్థంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో
# మరో కీలక ముందడుగు

మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం. ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. పర్యావరణ శాఖ మంత్రి హోదాలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కర్బన ఉద్గారాలను (కార్బన్ ఫుట్‌ప్రింట్) పరిమితం చేసేలా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని తెలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్న సంస్థలను మేం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం" అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన అన్ని సహకారాలు అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే
# రూ. 4,571 కోట్లు ఉంది

మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చేయబోతున్నట్లు ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే రూ. 4,571 కోట్లు ఉందని భట్టి విక్రమార్క వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బకాయిలను మానవతా కోణంలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అలాగే ఉద్యోగుల కోసం క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కూడా అందజేశామని గుర్తుచేశారు.

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక
# జోన్లుగా విభజిస్తున్నాం

మొదటి పేజి తరువాయి



నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## విజయమ్మ లేఖ నిజం..
## దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి

మొదటి పేజి తరువాయి

వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం

వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు. తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు.

విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి

తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు.

దమ్ముంటే జగనే మాట్లాడాలి

ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. "ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?" అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు.

వైసీపీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు

రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు. ఫ్రంట్ పేజీలో రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో వేసుకుని సత్యమేవ జయతే అని చెప్పుకునే సాక్షి పత్రికకు నిజం పట్ల గౌరవం లేదని విమర్శించారు. జగన్‌కు నిజం వైపు నిలబడే ధైర్యం లేకపోవడం వల్లే తన పార్టీలోని నాయకులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాళ్లను నాయకులు అనాలో, కుక్కలు అనాలో మీరే అనుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జగనే అని, ఆయన దర్శకత్వంలోనే ఈ నాటకం నడుస్తోందని ఆమె ఆరోపించారు.

## ముత్యాల సిద్ధార్థ అకాలమరణంపట్ల తీవ్ర దిగ్భ్రాంతి!..

### తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు!..




వి.ఆర్.పురం, మర్చి23(నేటి శుభోదయ ప్రతినిధి) తెలుగుదేశం పార్టీపోలవరంజిల్లా! బి.సి,సెల్ అధ్యక్షులు ముత్యాల రామారావు కుమారుడు ముత్యాల సిద్ధార్థ,అకాల మరణం పట్ల తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్ధార్థ,మృతి పార్టీకితీరనిలోటని ఆయన పేర్కొన్నారు.సోమవారం ఈసందర్భంగా తెలుగుదేశంపార్టీ మాజీ జడ్పి.టి.సి,సభ్యులు ముత్యాల రామారావును మంత్రి చరవాణి ద్వారా పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజలకు సేవచేయాలనే తపనతో ముందుకు సాగిన సిద్ధార్థ వంటి యువనాయకుడిని కోల్పోవడం పార్టీకి పెద్దనష్టమని అన్నారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.తెలుగుదేశంపార్టీ తరఫున అన్నివిధాలుగా అండగా ఉంటుందని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉన్నారని అధైర్య పడొద్దని చెప్పారు.

## "మీ ఇంటికి - మీ డాక్టర్" మొబైల్ మెడికల్ యూనిట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



నేటి శుభోదయ నంద్యాల, మార్చి 23:-గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న "మీ ఇంటికి మీ డాక్టర్" విన్నూత్న ప్రాజెక్ట్‌లో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి ప్రారంభించారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ (గ్రా+వా) ఆవరణలో సుమారు రూ. 8.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మెడికల్ యూనిట్‌ను కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు జి. రాజకుమారి మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు అందుబాటులోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. రెడ్ క్రాస్ వంటి సేవా సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య రక్షణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆమె అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో నివసించే పేదలకు ఉచిత వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.



మహిళా సాధికారతపై దృష్టి సారిస్తూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, నాయకత్వ స్థానాల్లో ఎక్కువగా భాగస్వామ్యం కావాలని ఆమె సూచించారు. సమాజంలో మహిళలపై వివక్షను నిర్మూలించడానికి చట్టాలతో పాటు సామాజిక చైతన్యం అవసరమని నొక్కిచెప్పారు. సామాజిక బాధ్యత ప్రతి పౌరుడి ధర్మమని, అవసరమైన వారికి సహాయం చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని, సేవా దృక్పథంతో పనిచేసే సంస్థలకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ మొబైల్ మెడికల్ యూనిట్ మార్చి నుండి మే వరకు నంద్యాల జిల్లాలోని బండి ఆత్మకూరు మండలంలోని 15 గ్రామాల్లో సేవలు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సాంకేతిక నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం పోరాడిన దొమ్మేటి వెంకటరెడ్డి స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నేటి శుభోదయం నంద్యాల, మార్చి 23:సామాజిక న్యాయం, విద్యా ప్రబోధం, అనగారిన వర్గాల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి గారి స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో దొమ్మేటి వెంకటరెడ్డి గారి 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, బీసీ కార్పొరేషన్ ఈడి జాకీర్ హుస్సేన్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి గారు శెట్టి బలిజ సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడిగా, ఆ వర్గం హక్కుల కోసం బ్రిటిష్ పాలన కాలంలోనే పోరాడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్య ప్రాధాన్యతను ఎంతో ముందుగానే గుర్తించిన వెంకటరెడ్డి గారు, ముఖ్యంగా వయోజన విద్యకు ప్రోత్సాహం ఇచ్చి ప్రతి ఇంటికి అక్షరాస్యతను తీసుకెళ్లేందుకు కృషి చేశారని తెలిపారు. సామాజిక చైతన్యం, హక్కుల కోసం పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపిన నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో, ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ సమన్వయంతో నిర్వహించినట్లు తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి గారు ప్రస్తుత కోనసీమ జిల్లాలోని బోడసకుర్రు గ్రామంలో జన్మించినట్లు గుర్తుచేసి, కోనసీమ ప్రాంతంలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బోడసకుర్రు - పాసర్లపూడి మధ్యనున్న వారధికి వెంకటరెడ్డి గారి పేరు పెట్టాలని స్థానికులు కోరుతున్నారని, ఆయనను శెట్టి బలిజ సమాజ పితామహుడిగా ప్రజలు గౌరవిస్తున్నారని తెలిపారు. ఆయన ఆశ యాలు, సేవా భావం భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## పండు ఆశయాలను ప్రెస్ క్లబ్ ద్వారా నెరవేర్చాలి

### అధ్యక్షుడు మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటు

### పాత్రికేయుల అభివృద్ధికి ఆఖరి రోజు వరకు కృషి చేసిన వ్యక్తి పండు

### ది గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పండు సంతాప సభలో పలువురు కితాబు



గోకవరం-నేటిసుబోదయ.:దిగోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రౌతుపండు అకాల మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని, జిల్లా వ్యాప్తంగా తనకున్న పరిచయాలతో ది గోకవరం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పండు అహర్నిశలు కృషి చేశారని, పలువురు సీనియర్ పాత్రికేయులు గుర్తు చేశారు . సోమవారం గోకవరంలోని ప్రెస్ క్లబ్ భవనం నందు ఏర్పాటుచేసిన సంతాప సభలో పండు చిత్రపటాన్ని ఆవిష్కరించి. పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుడుపూడి పార్థసారథి,ఎపి డబ్ల్యు జె రాష్ట్ర కార్యదర్శి మండేల శ్రీరామ్మూర్తి పాల్గొని మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పాత్రికేయులందరినీ సంఘటితం చేసి, వారందరి అభివృద్ధికి పండు చేసిన కార్యాచరణ మరిచిపోలేనిదని అన్నారు. సామాజిక సేవ పట్ల పండు చూపించిన చొరవ గొప్పదని ప్రసంసించారు. ది గోకవరం ప్రెస్ క్లబ్ ద్వారా పండు ఆశయాలను నెరవేర్చే విధంగా పాత్రికేయ సభ్యులు మెలగాలని సూచించారు. గోకవరంలో ది గోకవరం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన మొదటి రోజు నుండి సంఘ అభివృద్ధికి, సభ్యుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి జిల్లా, రాష్ట్ర నాయకులతో తరచూ సంప్రదింపులు జరిపే వారిని, పండు అకాల మరణం తోటి పాత్రికేయులకు తీరని లోటని అన్నారు. ఉన్నత ఆశయాలు ఉన్న పండు కుటుంబ సభ్యులకు పాత్రికేయులంతా అండగా ఉండాలని సూచించారు. ది గోకవరం ప్రెస్ క్లబ్ లో ఉన్న సభ్యులందరికీ కనీస అవసరాల కల్పనకు పండు శక్తి వంచన లేకుండా కృషి చేశారని , దాని ఫలితమే జిల్లాలోనే మంచి ప్రెస్ క్లబ్ ఏర్పాటు , జర్నలిస్టులకు నివాస స్థలాల కల్పన సాధ్యమైందని ది గోకవరం ప్రెస్ క్లబ్ కార్యదర్శి కర్రి శివరామకృష్ణ అన్నారు. తమ అధ్యక్షుడు మృతి తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గోకవరం, కోరుకొండ, దేవీపట్నం తదితర మండలాలకు చెందిన పాత్రికేయులు, పిఆర్వోలు, వివిధ జర్నలిస్టు సంఘ నాయకులు పండు సంతాప సభలో పాల్గొని, నివాళులర్పించారు.

# ప్రతీనోటా రామనామమే

**అందరిచూపు శ్రీరామగిరి వైపే!..**

**ప్రతీఅడుగు శ్రీరామగిరి వైపే!..**

**శ్రీరామరామ రామేతి!మనోరమే రమే రమే!..**

**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే!..**

**రామనామంలో అద్భుతశక్తి ఉంది!..**

**శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు!...**

వి.ఆర్.పురం,మార్చి23(నేటి శుభోదయ ప్రతినిధి) శ్రీరామ, రామ, రామేతి మనోరమే రమే,రమే, సహస్రనామతత్తుల్యశ్రీ రామనామ, వరాననే. ఈరామనామంలో అద్భుతశక్తి సామర్థ్యాలున్నాయని,రామ నామంజపించినా, శ్రీసీతారాముల కళ్యాణం చూసినా అద్భుతమైన ఫలితాలు ఆశించవచ్చునని శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు,ఆశాభావం వ్యక్తం చేశారు.సోమవారం,నేటి శుభోదయ ప్రతినిధి,నాగేంద్రబాబుకి,ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా కొన్నిముఖ్యమైన విశేషాలు!...ప్రశ్న:-లిఆలయనిర్మాణం ప్రత్యేకతలు దీనిని నిర్మించినదేవరు జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో,ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోభద్రాచలరామాలయ పుణ్యక్షేత్రం నిర్మాణానికంటే ముందుగానే,శ్రీరామగిరి ఆలయం పుణ్యక్షేత్రం ఉందని పురాణాల ద్వారా తెలుస్తుంది.ఈ ఆలయాన్ని మాతంగముని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది.ఈ ఆలయంలో అద్భుతమైన శక్తులు ఉన్నాయని భక్తులు కోరినకోర్కెలు తీరుతాయని భక్తులు నమ్ముతారు.ఇది 100%నిజం కూడా!...

### ప్రశ్న: శ్రీరాముని,గురించి కొన్ని విషయాలు మీమాటల్లో చెప్పండి

జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు:శ్రీరాముడు సుగుణాభి రాముడు,రామనామంఎంతో మధురానుభూతిని కలిగిస్తుంది.పాపాలను తొలిగించే అద్భుతమైన శక్తి రామనామంలో ఉంది.శ్రీరాముడికి సేవలు చేయడం నాపూర్వజన్మ శుక్రుతంగా భావిస్తా.

### ప్రశ్న:శ్రీరామగిరికి ఆపేరు ఏలావచ్చింది

జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు:ఈ ప్రాంతంలోఅంటే ఇక్కడ స్వామివారు ధ్యానంచేస్తున్న తరుణంలో దక్షిణముఖంతో అద్భుతమైన కాంతివెలుబడి ఎంతో దేదీవ్యమానంగా కనిపించారని అందుకే ఇక్కడ వెలసిన శ్రీరాముడిని సుందర రాముడిగా!ధ్యానం చేసినందున యోగ రామునిగా ప్రజలు పిలుస్తారు.రాముడు చేసిన "గిరి"కాబట్టి శ్రీరామగిరిగా ప్రసిద్ధి చెందింది.ప్రశ్న:దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవానికి



శ్రీకారంచుట్టింది ఇక్కడే?అంటే శ్రీరామగిరిలోనే నిజమేనా

### జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు:

గతంలో అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇక్కడ ఎన్నో ప్రత్యేకతలు ఉండేవి.ఇక్కడ నిర్వహించే కళ్యాణ మహోత్సవానికి ఎంతో ప్రత్యేకమైన,నియమ,నిష్టలు,ఉమ్మడి రాష్ట్రంలో ఇమిడిఉండేవి ప్రస్తుతంఉమ్మడిరాష్ట్రంవిడిపోయి 12 ఏళ్ళుకావస్తుంది కొన్ని నియమ నిబంధనలు ప్రస్తుతం నిర్వహించడంలేదు.గతంలో ఇక్కడ కళ్యాణతంతు నిర్వహించాకే భద్రాచలంలో నిర్వహించే ప్రత్యేకపద్ధతి ఉండేదట.అంటే ఈప్రసిద్ధ క్షేత్రానికి ఎంత పేరుప్రతిష్టలు కలిగిఉండేదో అర్థంచేసుకోవచ్చు.

ప్రశ్న:-ఇంతటిచరిత్రను సంతరించుకున్న శ్రీరామగిరి దేవాలయం ప్రస్తుత పరిస్థితుల్లో సరైన రోడ్డుసౌకర్యంలేక,భక్తులు పడే ఇబ్బందులు చైర్మన్ గా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తే బాగుంటుంది దానిపై మీఅభిప్రాయం ఏంటీ

### జవాబు చైర్మన్ సుదర్శన్ రావు:

అందరిదీ అదేఅభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి,దృష్టికితీసుకు వెళ్లాం.పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాం అందుకే రోడ్డు వేసే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి.దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు సౌకర్యానికి గట్టి ప్రయత్నం చేస్తా.అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,తో కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,దృష్టికి తప్పకుండా తీసుకు వెళ్తా!ప్రస్తుతం అవసరం రీత్యా మరమ్మతులు అంటే గ్రావేల్ వెయిస్తాం.

ప్రశ్న:ఏర్పాట్లు ఏలా జరుగుతున్నాయి.శ్రీసీతారాముల కళ్యాణానికి భక్తులు భారీగావచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్లానింగ్ ఏమైనా ఉందా

### జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు:

ముందుగా ఎప్పటిలానే "చలువపందిళ్ళు"భక్తులకు భోజన ఏర్పాట్లు,త్రాగునీరు సౌకర్యాలు,శ్రీ సీతారాముల కళ్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు,దర్శనానికి ప్రత్యేక కౌంటర్లు,ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నాం.గత ఏడాదికంటే ఈఏడాది భారీగా భక్తులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకుదగ్గ ఏర్పాట్లు చేస్తున్నాం.

### ప్రశ్న:శ్రీసీతారాములకు సేవచేసే భాగ్యం మీకుకల్పించారు.

శ్రీసీతారాముల సేవచేయడం మీకుకలిగిన పూర్వజన్మశు క్రుతంగా భావిస్తున్నారా

జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు:ఔను నిజంగా 400 సంత్సరాల చరిత్రకలిగిన యోగరాముని నిలయం శ్రీరామగిరి ఆలయం ఈఆలయానికి చైర్మన్ గా!సేవలుఅందించడం ఎన్ని జన్మలపుణ్యమో!ఈప్రాంతంలో ప్రతీఅడుగు చరిత్రికఘట్టమే,27 శ్రీరామనవమి,30న దొంగలదోపు ఉత్సవం,అన్నీఏర్పాట్లు శ్రీసీతారాముల ఆశీస్సులతో, శ్రీరామగిరి ప్రజలఅండదండలతో,సర్పంచ్ పులి సంతోష్ కుమార్,చొరవతో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నాం. ఇక్కడ అంతా రామనామస్మరణతో వరరామచంద్రాపురంమండలం, శ్రీరామగిరి గ్రామం మారుమ్రోగుతున్నాయి.ఈ అద్భుతమైన ఘట్టం కోసం వేలాదిగా ప్రజలుఎదరు చూస్తున్నారు. తెలంగాణ, చత్తీస్గడ్,ఒరిస్సా, నుండిభక్తులు భారీగాతరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రశ్న:భద్రత ఏర్పాట్లు చేస్తున్నారా నాలుగు రాష్ట్రాల ప్రజలు,అధికారులు,ప్రజా ప్రతినిధులు,శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి,బాలల హక్కుల కమీషన్ సభ్యులు,ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ చైర్మన్ ఉండవల్లి గాంధీబాబు, అధితులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.ఏర్పాట్లు ఏలా ఉన్నాయి జవాబు:చైర్మన్ సుదర్శన్ రావు, ఎక్కడా ఇబ్బంది లేకుండా ఎప్పటిలానే పోలీస్ శాఖ స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్,ఎస్సై సంతోష్ కుమార్,భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.గట్టిభద్రత చర్యలు చేపట్టారు.



## ఏలూరు కలెక్టరేట్ లో ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు

### - దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ఏలూరు, నేటి శుభోదయ ::: ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త ని, స్వాతంత్ర్య సంగ్రామంలో జాతీయోద్ధరణకు కృషి చేశారన్నారు. ముఖ్యంగా సమాజంలో విద్య ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి, ప్రజలను విద్యావంతులను చేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, సర్వే శాఖ ఏడి అన్సారీ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఇళ్ల వరప్రసాద్, ఉపాధ్యక్షులు ఇళ్ల శ్రీనివాస్, జుత్తిగ శ్రీనివాస్, పంపన వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసది శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు వనము నరసింహారావు, ట్రెజరర్ గుబ్బల దుర్గ రావు, సభ్యులు దంపబోయిన రఘు, బండి కైలాసపతి, ప్రభృతులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల సేకరణలో వాస్తవాలు ప్రతిబింభించేలా చూడాలి

### - కృష్ణాజిల్లా కలెక్టర్ డి. కే. బాలాజీ





మచిలీపట్నం మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) :జనాభా లెక్కల సేకరణ ఏలాంటి తప్పులు లేకుండా వాస్తవాలను ప్రతిబింబించే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా జనాభా లెక్కల అధికారి డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ విసి హాల్లో జనాభా లెక్కల సేకరణ పై క్షేత్రస్థాయిలో ట్రైనర్లు అయిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ చాలా ముఖ్యమైన కార్యక్రమం అన్నారు. జనాభా లెక్కలు సేకరించే సమయంలో చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏమైనా నిర్ణయాలు తీసుకోవాలంటే జనాభా లెక్కల ఆధారంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇచ్చే విషయంలో ఈ జనాభా లెక్కలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎన్ని రకాల సర్వేలు ఉన్నప్పటికీ జనాభా లెక్కల వివరాల సేకరణ చాలా ముఖ్యమన్నారు. తప్పులు లేకుండా సజావుగా జనాభా లెక్కలు సేకరించాలన్నారు.వాస్తవాలు చెబితే ప్రస్తుతం పొందుతున్న పథకాల ప్రయోజనాలు దూరం అవుతాయని అపోహ కొందరిలో ఉంటుందన్నారు.కానీ నిజానికి అటువంటిది ఏమీ ఉండదని ధైర్యంగా ప్రజలు వారి వివరాలను తెలియజేయాలన్నారు.జనాభా లెక్కల సేకరణ లో కేవలం లెక్కలు, అంకెలు మాత్రమే ఉంటాయని ఇతరత్రా మనుషుల పేర్లు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉదాహరణకు వాయు కాలుష్యం తగ్గించాలన్న, రహదారుల విస్తరణ చేయాలన్న వాహనాల వివరాలు వాటి సంఖ్య అవసరం ఉంటుందని అదే గనుక ఆ వివరాలు



ఇవ్వకపోయినా నిధులు మనకు రాకుండా పోయే అవకాశం ఉందన్నారు.జనాభా లెక్కల సేకరణకు ఓటు హక్కుకు ఎలాంటి సంబంధం లేదని నిర్భయంగా ప్రజలు వారి వివరాలను ఎన్యుమరేటర్లకు తెలియజేయాలన్నారు ఈ తరగతుల్లో జనాభా లెక్కల సేకరణ రాష్ట్ర అదనపు సంచాలకులు ప్రసన్న కుమార్, డిఆర్వో చంద్రశేఖర రావు, జిల్లా మాస్టర్ ట్రైనర్లు డిటిడబ్ల్యువో ఫణి ధూర్జటి, కృష్ణ విశ్వవిద్యాలయం ఆచార్య శ్రావణి, శిక్షణ పొందుతున్న పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్మాత ఆలయానికి విరాళం అందజేత



విజయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి విజయవాడకు చెందిన సగలమర్రి పిచ్చయ్య 1,01,120/- రూపాయలను విరాళంగా ఆలయ అధికారులను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## ఇంద్రకీలాద్రి పై వైభవంగా శ్రీ పరాభవ నామ సంవత్సర వసంత నవరాత్రి మహోత్సవాలు

విజయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పె నిర్వహించారు. శాస్త్రోక్తంగా



తెల్ల జిల్లేడు, మారేడు దళాలు, తులసి, మరువం, దవనం ఐదు రకాల పవిత్ర పత్రాలు, పుష్పాలతో అమ్మవారిని అర్చించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), పాలక మండలి సభ్యులు అందరూ కలిసి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పాలక మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, గుడపాటి వెంకట సరోజిని దేవి, జి.వి. నాగేశ్వరరావు, జింకా లక్ష్మీదేవి, మన్నె కళావతి, మోరు స్రవంతి, పద్మావతి ఠాకూర్, పానబాక భూలక్ష్మి, పెనుమత్స రాఘవ రాజు, సుబ్రహ్మణ్య కుమార్ ఏలేశ్వరపు, సుకాసి సరిత, తంబళ్లపల్లి రమాదేవి, తోటకూర వెంకట రమణారావు, తరిగొప్పుల పార్వతి, మార్తి రామబ్రహ్మం తదితరులు ఈ పుష్పార్చన సేవలో పాల్గొన్నారు. వసంత నవరాత్రుల పుణ్యకాలంలో ఇంద్రకీలాద్రిపై భక్తిభావం వెల్లివిరుస్తోంది.



## నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేత

విజయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన వెంకటరత్నం 1,00,116/- రూపాయలను విరాళంగా సంబంధిత ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## గుడివాడ సిపిఎం కార్యాలయంలో స్వతంత్ర సమరయోధుల వర్ధంతి కార్యక్రమాలు



గుడివాడ, మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) స్థానిక సుందరయ్య భవన్ లో స్వతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ మరియు డివైఎఫ్ఐ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని అమరవీరులకు నివాళి అర్పించారు, వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు. వ్యసనాలకు బానిసలైన యువత భగత్ సింగ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకొని, జీవితంలో మార్పు వచ్చింది దేశ ఉన్నతికి కృషి చేయాలని సిపిఎం నాయకులు ఆర్ సి పి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, కొండ, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

## దొమ్మేటి వెంకటరెడ్డికి ఘన నివాళులు



విజయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా అదనపు కమిషనర్లు డాక్టర్ డి చంద్రశేఖర్, ఎ.రవీంద్రరావు, దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బందితో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ జనరల్ ఎ. రవీంద్రరావు మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి సమాజ సేవలో విశిష్ట స్థానం సంపాదించిన మహనీయులని పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త, శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకుంటూ ఘననివాళులు అర్పించారు. శెట్టిబలిజ సమాజానికి విద్య, ఐక్యత, గౌరవం తీసుకువచ్చిన గొప్ప సామాజిక సంస్కర్తగా ఆయన గుర్తింపు పొందారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి వారి అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, పర్యవేక్షణ ఇంజనీర్( వర్క్స్) చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డి. హరీష్, బయాలజిస్ట్ వి కామేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదుకు సంతృప్తికరమైన, శాశ్వత పరిష్కారం అందించాలి



జయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను, విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సమస్యకు క్షేత్రస్థాయిలో అధికారులందరూ పరిశీలించాలని, అర్జీదారులకు వారి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం అందిస్తామన్న భరోసాని ఇవ్వడమే కాకుండా సత్వరమే అందించేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 20 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 9, ఇంజనీరింగ్ 6, పబ్లిక్ హెల్త్ 2, రెవెన్యూ 3, మొత్తం కలిపి 20 ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇ/ఛ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు, ఆర్ఎఫ్ఓ మాల్యాద్రి పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చనున్న భారీ స్టీల్ ప్లాంట్

### - కూటమి ప్రభుత్వ విజన్‌కు నిదర్శనం: గద్దె క్రాంతి కుమార్



విజయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- అనకాపల్లి జిల్లాలో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరగడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలిచిందని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం గద్దె క్రాంతి కుమార్ 12వ డివిజన్ కృష్ణా నగర్ లో పర్యటించి, పేద దళిత యువకుడు గద్దె కోటి (మరియబాబు)కి స్వయం ఉపాధి నిమిత్తం కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునేందుకు కొబ్బరి బోండాలా బండిని క్రాంతి కుమార్ సొంత నిధులతో అందజేసిన ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సుమారు రూ. 1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష మందికి ఉద్యోగావకాశాలు కలగనున్నాయని తెలిపారు. ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత బలపరిచే శక్తి ఈ ప్రాజెక్టుకు ఉందన్నారు. మొత్తం 5,465 ఎకరాల్లో రెండు దశల్లో నిర్మితమవుతున్న ఈ స్టీల్ ప్లాంట్ రాష్ట్ర అభివృద్ధి దిశగా మరో కీలక అడుగుగా నిలుస్తుందని, పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనమని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి నిర్వీర్యం చేయాలని ప్రయత్నించిందని విమర్శించిన క్రాంతి కుమార్, కూటమి ప్రభుత్వం మాత్రం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను యథావిధిగా కొనసాగించడంతో పాటు మరో భారీ స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురావడం గొప్ప విషయం అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, పారిశ్రామిక పురోగతే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్థతను ఈ ప్రాజెక్టు స్పష్టంగా ప్రతిబింబిస్తోందని కొనియాడారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక రాష్ట్రంగా ఎదగడం ఖాయమని గద్దె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి బాలయోగి, నూతి శ్రీనివాస్, సాయన సత్యనారాయణ, మాదిరెడ్డి రవి, ఎస్.కె. నాగూర్, గద్దె తంబీ తదితరులు ఉన్నారు.

## బీసీ డిమాండ్లు నెరవేర్చాలని వినతి




నేటి శుభోదయ నంద్యాల మార్చి 23 :భారత చైతన్య యువజన పార్టీ కోరుతున్న 5 డిమాండ్లు ఈ నెల 31తేది కూటమి ప్రభుత్వం నేరవేర్చక పోతే, బి. సి ల అగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని బి సి వై పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పద్మావతి నగర్ లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి బీసీ వై పార్టీ నాయకులు, కార్యకర్తలు పూల మాల వేసి నివాళులు అర్పించి , అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి కలెక్టర్ రాజకుమారి ఘనియా కు 5 డిమాండ్ల తో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రములో బీసీల శాతం అధికంగా ఉండి, అన్ని లకు వెన్నుదన్నుగా సేవ చేస్తున్నా , వారి సంక్షేమశీ పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయి. బి. సి కార్పొరేషన్ లకు జనాభా కు తగినట్లు నిధులు ఇవ్వడం లేదని , విద్య, ఉద్యోగ , రాజకీయ చట్ట సభల్లో 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని , అమరావతి లో బి సి లకు వెయ్యి ఎకరాలు కేటాయించాలని, బి సి లకు అట్రసిటీ ప్రత్యేక రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏప్రిల్ 11నుంచి మరో స్వాతంత్ర్య పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు వెంకటసుబ్బయ్య యాదవ్, నర్సయ్య యాదవ్,రఘు రాముడు యాదవ్ , డా.రామకృష్ణ , సాంబశివుడు, సుదర్శన్, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈలకు భారీ ఊరట

### పూచీకత్తు లేకుండానే 20 లక్షల వరకు రుణం



విజయవాడ, మార్చి 23 (నేటి శుభోదయ):- దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. . ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలకు ఊరటనిస్తూ, ఎటువంటి పూచీకత్తు (గ్యారెంటీ) లేకుండా ఇచ్చే రుణ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు . ఈ నిబంధన 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని మంత్రి తెలిపారు. లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఎంఎస్ఎంఈ పథకాలు, రుణాల వివరాలపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024--25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వారీగా మంజూరైన ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరైన వివరాలను మంత్రి తెలుపుతూ. మహారాష్ట్రలో అత్యధికంగా 15.76 లక్షల మేర పరిశ్రమలకు రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో 11.97లక్షలు, పశ్చిమ బెంగాల్ 11.69 లక్షలు, తమిళనాడులో 11.51 లక్షలు, కర్ణాటకలో 9.39 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 6.37లక్షలు, తెలంగాణలో 4.94 లక్షల పరిశమ్రలకు రుణాలను ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడచిన ఏడాది 2,36425 మంది రుణాల కోసం ధరఖాస్తులు చేసుకోగా వాటిలో 17667 రుణ ధరఖాస్తులను మాత్రమే తిరస్కరించి మిగిలిన 218758 ధరఖాస్తు దారులైన ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తలకు రుణాలను అందించినట్లు వివరించారు. ఎంఎస్ఎంఈల కోసం కేంద్ర ప్రభుత్వం మ్యూచువల్ క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి వివరించారు . మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈలు) వారి వ్యాపారాలను వృద్ధి చేసుకోవడానికి రుణాలను పొందడంలోఈ పథకం రుణదాతలకు క్రెడిట్ గ్యారెంటీ కవర్‌ను అందిస్తుందన్నారు. (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, ఆల్ ఇండియా ఫైనాన్షియల్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు) కొనుగోలుతో కూడిన వారి ప్రాజెక్ట్‌ల కోసం ఎంఎస్ఎంఈలకు 100 కోట్ల వరకు రుణాల కోసం పరికరాలు / యంత్రాలు. ఇంకా, క్రెడిట్ యాక్సెస్‌ని మెరుగుపరచడానికి పథకం సవరించినట్లు తెలిపారు. రూ. 20 కోట్ల వరకు రుణాలపై తమ పరిశ్రమలను బాగా నడుపుకుంటూ తిరిగి చెల్లింపులు చేసే వారికి 75% క్రెడిట్ గ్యారెంటీ కవరేజీని పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. ధరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే ఆస్కారం కనపిస్తోందని ఎంపీ శివనాథ్ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల ద్వారా సుమారు 6.37 లక్షల మందికి రుణాలు మంజూరయ్యాయని తెలిపారు . రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ -- ఏపీ) నివేదిక ప్రకారం. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2024-25) ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒక్క యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోనే అత్యధికంగా 1,02,207 దరఖాస్తులు రాగా, అందులో 5,777 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, ఇండియన్ బ్యాంకు ద్వారా 43456 ధరకాస్తులు రాగా వాటిలో 1729 ధరకాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. అదే విధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 10,468 దరఖాస్తులు , కెనరా బ్యాంకుకు 39,299 దరఖాస్తులు అందినట్లు అధికారికంగా కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఎంఎస్ఎంఈల కోసం అమలవుతున్న ప్రధాన పథకాలను మంత్రి పంకజ్ చౌదరి వివరించారు. ముద్రా యోజన పథకం (పీఎంఎంవై) గురించి తెలుపుతూ దీని కింద ఇచ్చే రుణ పరిమితిని 20 లక్షలకు పెంచారన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల కులవృత్తుల వారికి తక్కువ వడ్డీకే (5%) రెండు విడతల్లో 3 లక్షల వరకు రుణం అందిస్తున్నారన్నారు. కొత్త యూనిట్ల స్థాపనకు ఉత్పాదక రంగంలో 50 లక్షలు, సేవా రంగంలో 20 లక్షల వరకు ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన పథకం పీఎంఈజీపీ ద్వారా 15% నుంచి 35% వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి వివరించారు. ఎంఎస్ఎంఈలను దృష్టిలో ఉంచుకుని రుణ మంజూరు ప్రక్రియ వేగవంతం చేసేలా రుణాల మంజూరులో జాప్యాన్ని తగ్గించేందుకు బ్యాంకులు కఠిన గడువులను పాటించాలని ఆర్బీఐ ఆదేశించినట్లు తెలిపారు. తాజా నిబంధనల మేరకు 25 లక్షల లోపు రుణాల దరఖాస్తులపై 14 పనిదినాల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని , అలాగే రుణాల మదింపు కోసం డిజిటల్ డేటా ఆధారిత 'క్రెడిట్ అసెస్‌మెంట్ మోడల' (సీఏఎం)ను ప్రవేశపెట్టినట్లు వివరించారు. దీనివల్ల కాగితపు పని తగ్గి, తక్కువ సమయంలోనే రుణాల మంజూరుకు అవకాశం కలుగుతుందన్నారు.

# బీసీల డిమాండ్లు నెరవేర్చకుంటే ఆమరణ నిరాహారదీక్ష చేపడతాం

### -భారత చైతన్య యువజన పార్టీ హెచ్చరిక
### -కృష్ణా జిల్లా కలెక్టర్ డి. కే. బాలాజికి వినతిపత్రం అందచేత



మచిలీపట్నం, మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) వెనుకబడిన తరగతుల (బీసీల) హక్కుల సాధన కోసం వారి సర్వతోముఖాభివృద్ధి కోసం భారత చైతన్య యువజన పార్టీపోరాటాన్ని ఉధృతం చేస్తుందని బీసీ వై నాయకులు పేర్కొన్నారు. సోమవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన అనంతరం నేతలు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన 'బీసీ సింహ గర్జన' సభలో బీసీల అభ్యున్నతి కోసం తీసుకున్న ఐదు కీలక డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. బీసీ రక్షణ చట్టం బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. అమరావతిలో రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో బీసీల సామాజిక అవసరాల కోసం 1000 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ పద్ధతిలో బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలన్నారు. విద్యా, ఉద్యోగ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు వారి జనాభా ప్రాతిపదికన 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నిధులు లేక నిర్వీర్యమైన బీసీ కార్పొరేషన్లకు వెంటనే నిధులు విడుదల చేసి, పెండింగ్ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో ఏప్రిల్ 11 నుండి ఆమరణ దీక్ష చెపడతామన్నారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించడానికి మార్చి 31 వరకు గడువు ఇస్తున్నట్టు పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తే, పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 11 నుండి శాంతియుత మార్గంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు హెచ్చరించారు. బీసీల ఆకాంక్షలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసివై పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షులు కోన నాగార్జున, అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు బొల్లా ఫణి బాబు, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు అనగాని రాంప్రసాద్, గుడివాడ నియోజకవర్గం యూత్ కన్వీనర్ బోయిన బిక్షం యాదవ్, కృష్ణాజిల్లా యూత్ కో కన్వీనర్ దన్నే రవిశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇది మహిళల ఆస్తి హక్కు సమస్యే గాని..

### జగన్ రెడ్డి కుటుంబ సమస్య కాదు....
### తల్లి చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ప్రజలకు న్యాయం చేస్తాడా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్లరమేష్....



నేటి శుభోదయ : మరావతి మార్చి 23, తండ్రి పాలనలో రూ. 43 వేల కోట్లు కలిగిన జగన్. చట్ట ప్రకారం తల్లి, చెల్లికి రెండు భాగాలు ఎందుకు ఇవ్వరని ? తమ ఆస్తి హక్కుకు రక్షణ ఉండాలంటే మహిళా లోకం జగన్ ను నిలదీయాలని. జగన్ ను ఆవహించి ఉన్న ధన పిశాచాన్ని వదలగొట్టకపోతే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందని అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు అమరావతి లో సోమవారం ఆయన విలేకరుల తో మాటాడుతూ ఉచ్చ నీచాలు మరిచిన ధన పిశాచికి రాజకీయాల్లో ఉండేందుకు అర్హత ఉన్నదా? సునీతకు అండగా నిలిచి మహిళల ధన, మాన, ప్రాణాల్ని, ఆస్తి హక్కులను రక్షించుకోవాలని. తల్లిని, చెల్లిని గౌరవించే భారతీయ సంప్రదాయాన్ని కాపాడుకోవాలని. చెల్లికన్నా బాబాయ్ ని నరికి నరికి చంపించిన అవినాష్ ఎందుకు ఎక్కువ అయ్యాడని ? రక్తపు మడుగును చేయించి సాక్ష్యాధారాల్ని అవినాష్ ఎందుకు ధ్వంసం చేయించాడని ? సాక్షాధారాలను ధ్వంసం చేయడం ఐపీసీ 301 ప్రకారం హత్యానేరంతో సమానం అని ఎంపీకి తెలియాదా? అని ఆయన ప్రశించారు అవినాష్ ను రక్షించకపోతే తాడేపల్లి ప్యాలెస్ ఫోన్ల గుట్టు రట్టు చేస్తాడని భయమా? టీడీపీ బూచి చూపి ప్రజల్ని ఎల్లకాలం మోసం చేయడమ సాధ్యమా? అని ఆయన ప్రశించారు. న్యాయస్థుడైతే చెల్లెళ్లు పరాయి గడప ఎందుకు తొక్కుతారు? ఎవరైనా సరే బాధిత మహిళలకు అండగా నిలిచిన చరిత్ర టీడీపీదేనని ఆయన కొనియాడారు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సొంత కేసులు, అక్రమ ఆస్తుల కోసం తాకట్టు పెట్టిన చరిత్ర జగన్ కాదా? అని. తల్లికి, చెల్లికి న్యాయం చేయని వ్యక్తి ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని ఆయన మండిపడ్డారు 2004 లో తన ఆస్తి రూ. 1.74 కోట్లు అని జగన్ ఆదాయపు పన్ను శాఖకు చూపించారని. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ. 43 వేల కోట్లు అక్రమార్జన చేశాడని. సీబీఐ న్యాయస్థానంలో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. తన పాలనలో ఒక్క మద్యం కుంభకోణంలోనే రూ. 3,500 కోట్ల అక్రమార్జన చేసినట్టు సిట్ నిర్ధారించిందని ఆయన విమర్శించారు విషపూరిత మద్యం వల్ల 30 వేల మంది మహిళల మాంగళ్యాలు మంటగలిశాయని తన పాలనలో ల్యాండ్. శాండ్. వైన్. మైన్. గంజాయి డ్రగ్స్ మాఫియా ద్వారా వేల కోట్లు అక్రమార్జన అక్రమార్జన చేశాడని ఆయన విమర్శించారు అతి తక్కువ కాలంలో లక్ష కోట్లు ఆస్తులకు జగన్ అధిపతి ఎలా అయ్యారని ఆయన విమర్శించారు న్యాయంగా సంపాదించిన తప్పు కాదు. కానీ ధన పిశాచ సమాజాన్ని అల్లకల్లోలం చేస్తుందని ఆయన విమర్శించారు జగన్ ధన పిశాచి అయ్యాడా? తన పాలన నేరాలు మయం అయిందని ఇలాంటి వారికి రాజకీయాల్లో ఉండే అర్హత ఉన్నదా? అని ప్రజలు ఆలోచించాలని ఆయన తెలిపారు కుల మత ప్రాంతీయ తత్వాలు రెచ్చగొట్టే కుల తంత్రపు వాదనతో ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు తల్లి చెప్పింది తప్ప అంట. చెల్లెళ్ళు చెబుతున్నది తప్పంట. సిపిఐ చార్ షీట్ తప్పట. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ కూడా తప్పట. తన నేరాలు హోరాలకు 11 సీట్లకే పరిమితం చేసిన ప్రజలది కూడా తప్పట. ఘోరాలకు అవినాష్ చెప్పేదే నిజం అని ప్రజలు నమ్మాలంట. ప్రజల విజ్ఞత పట్ల జగన్కు ఎంత చులకన భావన ఉందో ఈ ధోరణి రుజువు చేస్తుందని ఆయన విమర్శించారు ఊరంతా ఒక దారి అయితే ఉల్లిపి కట్టేది. మరొక దారి అన్న చందంగా జగన్ సైకో ముఠా తీరు ఉందాని ఆయన విమర్శించారు హత్యా రాజకీయాలకు వ్యతిరేకంగా శాంతియుత పులివెందుల కోసం ఒంటరిగా ధైర్యంగా న్యాయ పోరాటం చేస్తున్న డాక్టర్ సునీతకు మహిళా లోకం ప్రజాస్వామ్య వాదులు ప్రజలు అండగా నిలవాలని. నేరస్తుల్ని చట్టం ముందు నిలబెట్టాలని. రాష్ట్రంలో ప్రజల ధన. మాన. ప్రాణాలు. ఆస్తులను కాపాడుకోవాలని పాతర్లరమేష్ ప్రజలను కోరారు.

## రైతులకు కూటమి ప్రభుత్వం అండ.



నేటి శుభోదయ వెలుగోడు మార్చి 23:రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అండగా ఉండి, అన్ని విధాలుగా ఆదుకుంటుందని శ్రీశైలం నియోజకవర్గ శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. వెలుగోడు పట్టణం లోని దాసరి పేట లో సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా రైతన్నలకు ఏడాదికి రూ. 20,000 వేలు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని చెప్పారు. రైతన్నలతో మమేకమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్, సాగునీటి భద్రత మరియు ప్రకృతి వ్యవసాయంపై ఎమ్మెల్యే రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారిణి స్వాతి , ఎంపిడిఓ మధుసూదన రెడ్డి , ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణారెడ్డి , వెలుగోడు రైతు సంఘము అధ్యక్షులు సూర్యనారాయణ , టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి , అబ్దుల్ కలాం , మోమిన్ రసూల్ , ఖలీల్ ,మాజీ ఎంపీటీసీ తెలుగు రమణ , మీసాల మధు, తెలుగు శ్రీనివాసులు, టైలర్ నాగస్వామి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ నివారణ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



నేటి శుభోదయ నంద్యాల మార్చి 23 :నంద్యాల జిల్లా ప్రతినిధి :నంద్యాల మార్చి 24 న జరగనున్న 'ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం' పురస్కరించుకుని, నంద్యాలలోని మంత్రిగారి కార్యాలయంలో సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ సంబంధిత అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ క్షయ రహిత సమాజం దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణకు సంబంధించి గళ్ల పరీక్ష, ఎక్స్-రే, జదీచూూ మరియు =ూజ= వంటి ఆధునిక పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని మంత్రి ఫరూక్ తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స సమయంలో పౌష్టికాహారం కోసం నెలకు రూ. 1000/- చొప్పున ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తోందని . సాధారణ టీబీ మరియు మొండి టీబీ (వీణ=ఎదీ) బాధితులకు అవసరమైన ఖరీదైన మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని . 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని మంత్రి ఫరూక్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ అంకిరెడ్డి ,నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మరియు ఇతర సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు!..

### సర్పంచ్ పులి సంతోష్ కుమార్!..



వి.ఆర్.పురం,మార్చి23(నేటి శుభోదయ ప్రతినిధి)శ్రీసీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలు అత్యంతవేగంగా నిర్వహించేవిధంగా చర్యలు కుంటామని శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్,వివరించారు.సోమవారం శ్రీరామగిరి గ్రామంలో మార్చి 27 న జరిగే శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని స్తానిక గ్రామ పంచాయతీ పాలకమండలి నేతృత్వంలో కార్యదర్శి రవితేజ, పర్యవేక్షణలో గ్రామంలో పారిశుధ్యపనులు చేపట్టారు.సీతంపేట నుండి శ్రీరామగిరి, మధ్యరోడ్డులోఉన్న పొదలు,ముళ్ల చెట్లు,తొలాగించారు అన్నదానం ప్రాంతంలో బ్లేడ్ ట్రాక్టర్ తో శుభ్రంచేయించారు వాహనాలు నిలిపేప్రదేశం గోదావరి స్నాన ఘట్టాలతదితరపనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.కళ్యాణానికి సంబంధించి చలవ పందిళ్లు దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు,దగ్గరుండి చేయిస్తున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్,ఉపసర్పంచ్,కోడిసెల దుర్గారావు,వార్డు సభ్యులు పర్యవేక్షణలో కార్యదర్శి దగ్గర ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు.భక్తులు భారీగా వచ్చే అవకాశంఉన్నందున అన్నీ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వివరించారు.

## భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు

### భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్ ను అరికట్టాలి.....

### సిఐటియు జిల్ల్ జ కార్యదర్శి ఆర్ వెంకటేష్.. డిమాండ్.



నేటి శుభోదయ, తిరుపతి జిల్లా, పుత్తూరు.: పుత్తూరు పట్టణంలో ఆటో స్టాండ్ వద్ద భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలని కొనియాడారు చిన్న వయసులోనే దేశ ప్రజల కోసం ఆయన ఉరికొంబలకు ఉరి తీసేటప్పుడు భగత్ సింగ్ తల్లిదండ్రులు దేశ ప్రజల కోసం మా కొడుకు ప్రాణాలర్పించిన ఎన్నో భగత్ సింగ్ లు ఆయన స్ఫూర్తితో దేశంలో ఎంతోమంది తయారవుతారని సంతోషంగా వారు చెప్పారుచెప్పారని అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో రాష్ట్రంలో డ్రగ్స్ మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు ఈ డ్రగ్స్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అయిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థులు భగత్ సింగ్ స్ఫూర్తితో ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లా కార్యదర్శి వై నందయ్య, సిఐటియు నాయకులు ఏ విజయ్, హరిచంద్ర, యాసిన్ భాష, రవి, శుభ తదితరులు పాల్గొన్నారు

## 'రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది..'

**– రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ..**

**– కోరుకొండలో ఘనంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..**

**– 66 మంది లబ్ధిదారులకు రూ. 40 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే బలరామకృష్ణ**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం కోరుకొండ మండల కేంద్రంలోని శాసనసభ్యులు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పంపిణీ చేశారు. ఆయనతోపాటు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెలికితీసి, త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 66 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 40 లక్షల రూపాయల విలువైన చెక్కులు పంపిణీ చేశామని తెలియజేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే 'బత్తుల' పేర్కొన్నారు. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాలకు చెందిన 66 మంది లబ్ధిదారులకు కూటమి, నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఎమ్మెల్యే 'బత్తుల' దంపతులు చెక్కులు అందజేశారు.

## కారుమూరి సునీల్ నీ కలిసిన వైఎస్ఆర్సిపి నాయకులు

### చిప్పాడ వెంకన్న గురజాల పార్థసారథి ముప్పిడి వీరాంజనేయులు



జంగారెడ్డిగూడెం మార్చి 23 (నేటి శుభోదయ ప్రతినిధి కోసనం ప్రేమ్ కిరణ్):వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి గోరుముచ్చు గోపాల్ యాదవ్ నీ మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్ఆర్సిపి ఏలూరు జిల్లా నాయి బ్రాహ్మణ విభాగ అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గురజాల పార్థసారథి జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు ఎక్స్ సర్పంచ్ ఏసుబాబు ఎండ్రపాటి శివాజీ లక్కవరం గ్రామం ప్రచార కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు కారుమూరి సునీల్ నాయి బ్రాహ్మణ విభాగ అధ్యక్షులు చిప్పాడ నరసరావుకి ఏలూరు జిల్లాలో ప్రతి గ్రామము తిరిగి నాయి బ్రాహ్మణులను బలోపేతం చేసి 2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటేసే విధంగా పనిచేయాలని తెలియజేశారు

## మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్,

### –కోర్టు ప్రాంగణాన్ని జల్లేడ పడుతున్న పోలీసు బృందాలు



మచిలీపట్నం, మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కోర్టులో బాంబు పెట్టినట్లు ఆగంతకులు జిల్లా న్యాయమూర్తికి మెయిల్ చేశారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చి న్యాయమూర్తి కోర్టు నుండి బయటకు వచ్చారు. న్యాయమూర్తులు, పోలీసులు కోర్టు వద్దకు చేరుకున్నారు.పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలు కోర్టు ప్రాంగణాన్ని జల్లేడపట్టారు. బాంబు బెదిరింపుతో కోర్టు లోకి ఎవరిని పోలీసులు అనుమతించలేదు.

## 'దొమ్మేటి వెంకటరెడ్డి ప్రముఖ సంఘ సంస్కర్త..

### ఆయన సేవలు చిరస్మరణీయం..'

**– రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ**



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో బి. సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిధి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ బి. సి వెల్ఫేర్ మంత్రి శ్రీమతి సవితకి రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.... దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు ప్రముఖ సంఘ సంస్కర్తని కొనియాడారు.సమాజంలో విద్య, ఐక్యత కోసం పోరాడిన ఆయన, శెట్టిబలిజలను ఏకం చేసి వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. కాబట్టి కూటమి ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిస్తూ ఏటా మార్చి 23 న ఆయన జయంతిని పురస్కరించుకుని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరిగింది. ఆయన గొప్ప సంఘ వ్యవస్థాపకుడు,శెట్టిబలిజల ఐక్యత కోసం, వారి హక్కుల కోసం శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. 1920 సెప్టెంబర్ 25న, తూర్పు గోదావరి జిల్లా బోడసకుర్రులో కుల సమావేశాన్ని నిర్వహించి, ఈడిగ వర్గాన్ని శెట్టిబలిజగా గుర్తింపు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన విద్య, సామాజిక సంస్కరణలు ; గాంధీజీ కంటే ముందే వయోజన విద్య వంటి కార్యక్రమాలను చేపట్టారు, బాల్యవివాహాలను వ్యతిరేకించారు. ఈ కార్యక్రమం లో స్థానిక శాసనసభ్యులు,శాసనమండలి సభ్యులు వివిధ శాఖల చైర్మన్ లు తదితరులు పాల్గొన్నారు.

## నా కుమారుడు 100 శాతం తప్పు చేయలేదు

**– పుట్టా సుధాకర్ యాదవ్ (ఏలూరు ఎంపీ తండ్రి)**

**బ్లడ్ శాంపిల్ తీసుకోకుండానే, బ్లడ్ టెస్టు రిపోర్టు ఎలా వచ్చింది..**

**ప్రముఖ ల్యాబుల్లో సొంతంగా టెస్టులు**

**– అన్ని రిపోర్ట్స్ నెగెటివ్**

**– అతి త్వరలోనే నిజాలు వెల్లడవుతాయి**



ఏలూరు, నేటి శుభోదయ ::: తన కుమారుడు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆయన తండ్రి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మైదుకూరులో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడారు. అనూహ్యంగా తన కుమారుడిపై వచ్చిన ఆరోపణల తాలూకు తీవ్ర దిగ్భ్రాంతి నుంచి తన కుటుంబం ఇంకా తేరుకోలేదన్నారు. తన కుమారుడు 100 శాతం తప్పు చేయలేదన్న సుధాకర్ యాదవ్, డ్రగ్స్ సహా ఎటువంటి దురలవాట్లు తన కుమారుడికి లేవని స్పష్టం చేశారు. ఒక డిన్నర్ పార్టీకి వచ్చిన ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్లిన తన కుమారుడు అక్కడి పరిస్థితి గమనించి బయటకు వచ్చేసే లోపే ఈగల్ టీమ్ పోలీసులు వచ్చి డ్రగ్స్ చెకింగ్ చేయాలని చెప్పి పోలీసుల సమక్షంలోనే యూరిన్ శాంపిల్ తీసుకున్నారని, 10 నిమిషాల తర్వాత పుట్టా మహేష్ కుమార్ కి నెగెటివ్ వచ్చిందని ఐదుగురికి మాత్రం పాజిటివ్ వచ్చిందని చెప్పడం ప్రజలంతా చూసారన్నారు. కొద్దిసేపటి తర్వాత మరోసారి శాంపిల్ తీసుకోవాలని చెబుతూ ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళి మళ్ళీ యూరిన్ శాంపిల్స్ మాత్రమే తీసుకున్నారన్నారు. శాంపిల్స్ తీసుకున్న ఐదు గంటల తర్వాత ఎస్పీ మీడియా ముందుకు వచ్చి, బ్లడ్ శాంపిల్స్ లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పాజిటివ్ వచ్చిందని విచిత్రంగా ప్రకటించడం చూస్తే, దీని వెనుక కుట్ర కోణం వంటిది ఏదో ఉందని తెలిసిపోతోందన్నారు. బ్లడ్ శాంపిలే తీసుకోకుండా, బ్లడ్ రిపోర్ట్ పాజిటివ్ గా వచ్చిందని ఏవిధంగా నిర్ధారించారో పోలీసులే చెప్పాలన్నారు. మొదటిసారి తీసిన యూరిన్ రిపోర్ట్ 10 నిమిషాల్లోనే బయటపెట్టగా, రెండో సారి తీసుకున్న యూరిన్ శాంపిల్ రిపోర్టు ఐదు గంటల తర్వాత బయటపెట్టడం కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు 2021వ సంవత్సరంలో హార్ట్ సర్జరీ చేసి స్టంట్ వేసిన విషయాన్ని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మీడియాకు వివరించారు. ఆ సమయంలో డాక్టర్ హార్ట్ లో కొన్ని వెజల్స్ వీక్ గా ఉన్నాయి, జాగ్రత్తగా ఉండాలని సలహా ఇచ్చారు. హార్ట్ పల్స్ 120 దాటకుండా చూసుకోవాలని, 120 దాటితే ప్రాణానికే ప్రమాదం అని డాక్టర్ చెప్పారన్నారు. దానిప్రకారంగా ఇప్పటివరకు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ ప్రతి 3 నెలలకోసారి అన్ని ఆరోగ్య టెస్ట్ లు చేసుకుంటూ డాక్టర్స్ సలహాలు, సూచనలు పాటిస్తున్నారన్నారు. వైద్య నిపుణులు ఎవరైనా చెప్పేదాని ప్రకారం డ్రగ్స్ తీసుకుంటే మనిషి హార్ట్ పల్స్ 150 నుండి 180 వరకు కొట్టుకుంటుందని, కానీ పోలీసులు పరీక్షలు చేసినప్పుడు పల్స్ 97 మాత్రమే ఉందన్నారు. డ్రగ్స్ తీసుకుంటే ప్రాణాపాయం అని తెలిసీ తన కుమారుడు డ్రగ్స్ ఏ విధంగా తీసుకుంటాడని సుధాకర్ యాదవ్ ప్రశ్నించారు. పోలీసులు ఇచ్చిన రిమాండ్ రిపోర్ట్ ప్రకారం అక్కడ అప్తిమెనీ, మాత్తిమెనీ అనే డ్రగ్స్ ఆనవాలు ఉన్నాయని చెప్పారని, హార్ట్, షుగర్ వంటి వాటి కోసం తీసుకునే మందుల వల్ల కూడా అటువంటి రిపోర్టు వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ వాళ్ళు చేసిన పరిశోధనలో కూడా తేలిన విషయం గమనించాలన్నారు. పోలీసు విచారణ ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత హైదరాబాద్, ఢిల్లీ లోని ప్రముఖ ల్యాబుల్లో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సొంతంగా యూరిన్, రక్త పరీక్షలు చేయించుకోగా అన్ని రిపోర్టుల్లో "నెగెటివ్" గా తేలిందని సుధాకర్ యాదవ్ స్పష్టం చేశారు. ఢిల్లీలోని ప్రఖ్యాత ఏఐఐఎంఎస్ సెంట్రల్ గవర్నమెంట్ ఆస్పత్రిలో కూడా బ్లడ్ టెస్టు చేయించగా 48 గంటల తర్వాత వారు ఇచ్చిన రిపోర్టు చూస్తే డ్రగ్స్ తీసుకోలేదని తేలిందన్నారు. పోలీసు విచారణ జరుగుతున్న సమయంలో తాము మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించలేని పరిస్థితి ఉందన్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్, త్వరలోనే తన కుమారుడు పుట్టా మహేష్ కుమార్ నిరపరాధిగా నిరూపించుకుని మీడియా ముందుకు వచ్చి అన్ని విషయాలు ఆధారాలతో సహా వివరంగా చెబుతారన్నారు. పార్టీ అధిష్టానం నుంచి అందిన షోకాజ్ నోటీసుకు ఎంపీ తన వివరణ పంపించారని కూడా సుధాకర్ యాదవ్ తెలిపారు.

## గన్నవరం విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన వారికి అమరావతిలో ప్లాట్ల కేటాయింపు

**75 మంది రైతులకు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.**



గన్నవరం, మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ కోసం ల్యాండ్ పూలింగ్ పథకం కింద భూములు సమర్పించిన రైతులకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ చొరవతో కొలిక్కి వచ్చింది. గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఆరవ విడత కార్యక్రమంలో భాగంగా, 75 మంది రైతులకు అమరావతి రాజధాని ప్రాంతంలో కేటాయించిన రూ.79 కోట్ల 87 లక్షల విలువ చేసే 85 ప్లాట్లకు సంబంధించిన అలాట్మెంట్ ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ దావాజీగూడెం గ్రామానికి చెందిన రైతులు పదేళ్లుగా ఎదురుచూస్తున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి, అసెంబ్లీలో మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని ఆయన తెలిపారు. ఇంత ఆలస్యమైనందుకు రైతులను క్షమాపణ కోరుతూనే, వారి హక్కులను కాపాడగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం 9 ఎకరాలకు సంబంధించి కొన్ని కోర్టు కేసులు, మరికొన్ని సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దావాజీగూడెంలోని సీతారామస్వామి దేవాలయానికి చెందిన భూముల విషయంలో జరిగిన అక్రమాలపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. 1895లో గొంది బాపయ్య అనే మహానుభావుడు ఆలయ ధూపదీప నైవేద్యాల కోసం ఇచ్చిన 4 ఎకరాల 34 సెంట్ల భూమిని గత పదేళ్లలో కొందరు రెవెన్యూ అధికారులు, వ్యక్తులు కలిసి రికార్డులు టాంపర్ చేశారని ఆయన మండిపడ్డారు. ఈ దేవుడి ఆస్తికి సంబంధించిన రికార్డులు సరిచేయించి, దానికి బదులుగా వెలగపూడిలో 4340 గజాల రెసిడెన్షియల్, 1850 గజాల కమర్షియల్ ప్లాట్లను కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఆర్ఓలపై విజిలెన్స్ విచారణ జరపాలని అసెంబ్లీలో కోరానని, రికార్డుల టాంపరింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో సహకరించిన కలెక్టర్ బాలాజీ, ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, ఎంఆర్ఓ శివయ్యలను ఆయన అభినందించారు. చిక్కవరం, సావరగూడెం వంటి గ్రామాల్లో చెరువుల్లో పడి ముగ్గురు పిల్లలు చనిపోయిన ఘటనపై కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని తాడిచెట్ల లోతు వరకు అక్రమంగా తవ్విన చెరువుల వల్ల ప్రాణాపాయం పొంచి ఉందని, తక్షణమే అటువంటి చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన పాత అధికారుల వల్లే ఈ అనర్థాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గన్నవరం పర్యటనలో కోరిన పలు సమస్యలకు సానుకూల స్పందన వచ్చిందని ఎమ్మెల్యే వివరించారు. రామవరప్పాడులో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి 9 గ్రామాలను దాని పరిధిలోకి తీసుకొస్తామన్నారు. రామవరప్పాడు వద్ద వంతెన నిర్మాణాన్ని జూన్ లోపు ప్రారంభిస్తామని, ఎనికేపాడు వద్ద వంతెనను భవిష్యత్తులో చేపడతామని తెలిపారు.ఏలూరు కాల్వ - పోలవరం లింక్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేయడానికి అంగీకరించారని చెప్పారు. గన్నవరం విమానాశ్రయ కొత్త టెర్మినల్ బిల్డింగ్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని, అంతర్జాతీయ సర్వీసులు త్వరలో అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, గన్నవరం తహశీల్దార్ కెవి శివయ్య, గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గూడపాటి తులసిమోహన్, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, రాష్ట్ర టిడిపి కార్యదర్శి దొంతు చిన్నా, ఎన్.ఎస్.పి వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాల కృష్ణ, వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్, గన్నవరం గ్రామ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, అరుమళ్ళ కృష్ణారెడ్డి, మేడేపల్లి రమ, మల్లారెడ్డి కిషోర్, బోయపాటి మురళీకృష్ణ, గొంది నరేంద్ర, బోడపాటి రవి, బుస్సే నాగప్రసాద్, గుజ్జర్లపూడి బాబూరావు, నెక్కంటి శ్రీదేవి, మద్దుకూరి విజయకుమార్, ఆళ్ల దమయంతి, దేవినేని సులోచన, తంగిరాల శ్రీనివాసరావు, బత్తిన అమలదాసు, బండి భాస్కర్, జాస్తి మురళి, ఈసారి రవి, చల్లగుల్ల సందీప్, చల్లగాలి సునీల్, నందిపాముల పృథ్వీ, కొమ్మారెడ్డి రాజేష్, సూరిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## జగన్ అన్యాయాలపై ప్రశ్నించేది సొంత తల్లి,చెల్లి

**కొడాలి నాని వారికి సమాధానం చెప్పాలి.మాకేం సంబంధం**

**–గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములి**

**–ప్రజలకు దూరమై,21నెలలుగా కనిపించని కొడాలి నాని...ఎక్కడ ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొని రాజకీయ జోస్యం చెప్తున్నాడో చెప్పాలి**

**–మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు... కౌంటర్ సమాధానం ఇచ్చిన ఎమ్మెల్యే.**

**–20ఏళ్లపాటు చేసిన మోసాన్ని....మళ్లీ చేస్తానంటే నమ్మే స్థితిలో ప్రజలు లేర**

**–ఏసీ కార్లలో పడుకున్నప్పుడు వచ్చిన కలలను.... ప్రజల ఆలోచనగా ప్రచారం చేస్తున్నాడు మనుగడ,జగన్ వద్ద మార్కుల కోసమే ఈ తాపత్రయమంతా.**



గుడివాడ, మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడ ప్రజల కష్టాలను పట్టించుకోని కొడాలి నాని రాష్ట్ర రాజకీయాల భవిష్యత్తు చెప్తున్నాడన్నాడని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విమర్శించారు.ఏసీ కారులో పడుకొని వచ్చిన... కలలను ప్రజల ఆలోచనలుగా ప్రచారం చేస్తున్నాడని, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఎవరికి కనిపించిన వ్యక్తి... గత 21 నెలలుగా ఏమైపోయాడో ఎవరికీ తెలియదు మరి అలాంటి వ్యక్తి ప్రజలను ఎప్పుడు కలిశాడు... ప్రజల ఆలోచనలు ఎలా తెలిసాయో చెప్పాలి

తుఫాన్లు వచ్చినప్పుడు కనిపించాడా... కష్టాల్లో ఉన్న ప్రజల వద్దకు ఏప్పుడైనా వెళ్లాడా. ప్రజలు కూడా కొడాలి నానిను ఎప్పుడో మర్చిపోయారని, 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి మాయమాటలు చెప్పే ప్రజలను మోసం చేశాడని, మాటలు చెప్పడం తప్ప కొడాలి నానికు విషయం లేదని ప్రజలు నిర్ధారించుకొని...ఈడ్చితన్నారని అన్నారు. ఆయన గురించి మాట్లాడడం దండగని, జగన్ పై విమర్శలు చేస్తుంది కూటమి నాయకులు కాదు, సొంత తల్లి,చెల్లి కుటుంబ సభ్యుల విమర్శలు చేస్తున్నారని,ఎవరు వాస్తవాలు చెబుతున్నారో ప్రజలు గమనిస్తున్నారు.కొడాలి నాని జగన్ కుటుంబ సభ్యులకు సమాధానం చెప్పాలి. మాకేం సంబంధం మేనల్లుడు,మేనకోడలికి అన్యాయం చేశాడని తల్లి, చెల్లి చెప్తుంటే...తన తండ్రిని హత్య చేశాడని మరో చెల్లి చెబుతుందని,జగన్ విషయంపై వారి కుటుంబ సభ్యులకు స్పష్టత ఉందని,నీ సొల్లు వాగుడు తగ్గించుకుంటే మంచిదన్నారు.తిరుపతి లడ్డు వ్యవహారంపై అడ్డంగా దొరికిపోయిన వైసిపి నాయకులు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు దేవుళ్లపై అపహస్యంగా మాట్లాడింది ఈ వ్యక్తులు కాదా? ఇప్పుడు మీరు చెప్పే నీతులను ఎవరు వింటారన్నారు.వైసిపి వాళ్ల మాదిరి బాధ్యత లేకుండా మేము ఉండలేమని, పరీక్షలో రాసే విద్యార్థుల మాదిరి నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడుతున్నామని, ప్రజల వద్ద మంచి మార్కులు సాధించడమే మా లక్ష్యమన్నారు. ఇలాంటి పిచ్చి వాగుడులు, వ్యంగ్యంగా మాట్లాడుతూ కాలం గడుపుకునే వ్యక్తులు మాటలను పట్టించుకోం.సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి పాలన చూసిన తర్వాత జగన్ ఏ స్థాయి వ్యక్తం ప్రజలకు తెలిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, వల్లపనేని వెంకట్రావు,కొండలమ్మ గుడి చైర్మన్ ఈడే మోహన్, పోలవరపు వెంకట్రావు, సాయన ప్రసాద్, కొడాలి రామరాజు, ఆంజనేయులు, మల్లీపెద్ది సుబ్రమణ్యం, పామర్తి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్ పై నిందలు వేయటం దురదృష్టకరం

**మాజీ మంత్రి కొడాలి నాని**

**2029 లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఆపగలిగిన శక్తి ఈ కూటమి ప్రభుత్వానికి లేదు**

**సూపర్ సిక్స్ అని రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు**

**లడ్డు అంశంలో కూటమి రాజకీయాలను దేవుడు చూస్తున్నాడు**



గుడివాడ, మార్చి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) సూపర్ సిక్స్ అని ప్రజలను మోసం చేసిన చంద్రబాబు అమలు చేయలేని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని చంద్రబాబు చేసిన దొంగ వాగ్దానాలు మూలంగా జగన్మోహన్ రెడ్డి ఓడిపోయారని మాజీ మంత్రి కొడాలి నానీ అన్నారు.ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్త మా నాయకుడు ఈ హామీలు అమలు చేశాడు అని కాలర్ ఎగరేసి మరీ చెప్పగలరని రాష్ట్ర ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి విలువ తెలిసిందని, జగన్ ను వదులుకున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారునవరత్నాలను 2024లో ప్రజలు గుర్తించకపోయిన,2029 ఎన్నికలకు జగన్మోహన్ రెడ్డి మాట తప్పారనే నమ్మకం ప్రజలకు ఏర్పడుతుందని,రాష్ట్రంలోని నిరుపేదలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందన్నారు.కూటమి ప్రభుత్వం దొంగ వాగ్దానాలతో ప్రజలను వంచిస్తోందని,ప్రజలు త్వరలోనే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారన్నారు.తిరుపతి లడ్డు అంశంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న రాజకీయాలను దేవుడే చూస్తున్నాడని, అపచారానికి పాల్పడిన వారికి దేవుడే తగిన బుద్ధి చెబుతాడని హెచ్చరించారు.తండ్రి చనిపోయిన తర్వాత తండ్రి ఆస్తిలో వాటా ఇచ్చే అన్నదమ్ములు ఉంటారు, కానీ తన సొంత సంపాదనలో కూడా వాటా ఇచ్చి, ఆడపిల్లల పట్ల ఎంతో సంస్కారంతో మెలిగిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఎంత విమర్శలు చేసినా ఆయన ఎప్పుడూ తన సోదరీమణుల గురించి తప్పుగా మాట్లాడలేదని గుర్తు చేశారు.జగను ఎదుర్కొనే ధైర్యం లేక కుటుంబ సభ్యులతోనే నిందలు మోపే కార్యక్రమం చేస్తున్నారని,2029 లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఆపగలిగిన శక్తి ఈ కూటమి ప్రభుత్వానికి లేదని జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్,పాలిటి చంటి,పేయ్యల ఆదాము,మట్ట జాన్ విక్టర్,మెరుగుమల కాళి,కందుల నాగరాజు,కొండపల్లి కుమార్ రెడ్డి,బిన్ను, నాగిరెడ్డి ఉమాశంకర్ రెడ్డి,చిన్న ఉమాశంకర్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,రంగారెడ్డి, బట్టిపాటి శ్రీనివాస్ రెడ్డి,తోట నాగరాజు,ఈదర విద్యాసాగర్ రెడ్డి,అడపా పండు, తదితరులు పాల్గొన్నారు



# తికమకపెట్టే ప్రశ్నలకు ఏఐ స్కోర్ ఎంతంటే..

## ‘హ్యూమనిటీస్ లాస్ట్ ఎగ్జామ్’ను అధిగమించగలదా?





కృత్రిమ మేధ (ఏఐ) అసాధ్యాలను సుసాధ్యం చేస్తోంది. ఒకప్పుడు క్లిష్టంగా భావించిన మ్యాసివ్ మల్టీ టాస్కింగ్ ల్యాంగ్వేజ్ అండర్‌స్టాండింగ్ (ఎంఎంఎల్‌యూ) వంటి పరీక్షల్లో 90 శాతానికి పైగా స్కోరు సాధించి మనుషుల మేధస్సును సవాలు చేస్తోంది. అయితే, ఏఐ సామర్థ్యాన్ని కొలిచే పాత కొలమానాలు సరిపోవని భావించిన శాస్త్రవేత్తలు దానికి అత్యంత కఠినమైన పరీక్షలు సిద్ధం చేశారు. అదే ‘హ్యూమనిటీస్ లాస్ట్ ఎగ్జామ్(హెచ్‌ఎల్‌ఈ). ఎంఎంఎల్‌యూ అనేది ఏఐ మోడల్స్ తెలివితేటలను, విజ్ఞానాన్ని, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని కొలవడానికి ఉపయోగించే ఒక అత్యంత ప్రజాదరణ పొందిన బెంచ్‌మార్క్ పరీక్ష. ప్రస్తుతం టెక్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారిన హెచ్‌ఎల్‌ఈ పరీక్ష వివరాలు, ఏఐ మోడల్స్ పనితీరుపై కథనం.

### ఏమిటీ హెచ్‌ఎల్‌ఈ?

### ఎందుకంత కఠినం?

ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలకు చెందిన 500 సంస్థల నుంచి దాదాపు 1,000 మంది నిపుణులు సిద్ధం చేసిన 2,500 ప్రశ్నల సమాహారమే ఈ హెచ్‌ఎల్‌ఈ. సెంటర్ ఫర్ ఏఐ సేఫ్టీ, స్కేల్ ఏఐ పరిశోధకులు దీన్ని రూపొందించారు. ఏఐ మోడల్స్‌లోని లోపాలను ఎత్తిచూపడం, వాటి అసలు సామర్థ్యాన్ని పరీక్షించడం దీని లక్ష్యం. 100కు పైగా విభాగాల్లోని నిపుణులు పంపిన ప్రతి ప్రశ్న ప్రస్తుత ఏఐ మోడల్స్‌ను ఓడించడమే కాకుండా ఇద్దరు నిపుణుల సమీక్షను దాటాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలు ఎంత కఠినంగా ఉన్నాయంటే ఆయా రంగాల్లోని నిపుణుల మధ్యే 15.4% నుంచి 18% వరకు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంటే, ఏ ఒక్క మనిషి కూడా అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం అసాధ్యం.



### గెలుపు ఎవరిది?

ఈ పరీక్ష ప్రారంభమైనప్పుడు (జనవరిలో ‘నేచర్’ పత్రికలో ప్రచురితమైన సమయానికి) అత్యుత్తమ ఏఐ మోడల్స్ కూడా 10 శాతం కంటే తక్కువ స్కోరుకే పరిమితమయ్యాయి. కానీ, గత కొద్ది నెలల్లోనే ఈ పరిస్థితి వేగంగా మారుతోంది.

### ఆందోళన కలిగిస్తున్న అంశాలు

ఈ పరీక్షలో బయటపడిన ప్రధాన లోపం ‘కాలిబ్రేషన్ ఎర్రర్’. సమాధానం తప్పు అని తెలిసినా ఏఐ మోడల్స్ అది 100% సరైనదని మొండిగా వాదిస్తున్నాయి. ఇది భవిష్యత్తులో వైద్య రంగం లేదా ఆర్థిక రంగంలో ఏఐని వాడేటప్పుడు తీవ్రమైన ప్రమాదాలకు దారితీయవచ్చు. ‘ఒక తప్పు సమాధానాన్ని తప్పు అని ఏఐ గుర్తించలేకపోవడం అనేది సాంకేతిక లోపం కాదు, ప్రస్తుత ఏఐ డిజైన్ లోనే ఉన్న ఒక నిర్మాణాత్మక సమస్య’ అని నిపుణులు చెబుతున్నారు.

### కొలమానమే కరిగిపోతోందా?

ఏఐ సామర్థ్యం ఎంత వేగంగా పెరుగుతుందంటే దాన్ని కొలిచే ‘యార్డ్‌స్టిక్’ కూడా సరిపోవడం లేదు. అందుకే పరిశోధకులు ‘హెచ్‌ఎల్‌ఈ రోలింగ్’ పేరుతో నిరంతరం అప్‌డేట్ అయ్యే డైనమిక్ టెస్టింగ్ విధానాన్ని ప్రకటించారు. ఇందులో అత్యుత్తమ స్కోరు సాధించినంత మాత్రాన దానికి జనరల్ ఇంటెలిజెన్స్ వచ్చినట్లు కాదని, కేవలం అకడమిక్ ప్రశ్నల్లో నిపుణత సాధించినట్లేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా మనిషి సృష్టించిన పరీక్షను మనిషి కంటే వేగంగా ఏఐ ఛేదిస్తుండటం విశేషం.

# హీట్‌కు హాట్ సొల్యూషన్ ఇదిగో కూల్ గ్యాడ్జెట్లు!



వేసవి వచ్చిందంటే బయట అడుగు పెడితే చాలు, సూర్యుడు తన వేడి గాలిని ముఖంపై కొడుతూ ‘ఇంట్లోనే ఉండు’ అని హెచ్చరిస్తూనే ఉంటాడు. కాని, టెక్నాలజీ తెచ్చిన ఈ చిన్న గ్యాడ్జెట్లు, సూర్యుడు తన వేడి ఎంత పెరిగినా ‘ఉఫ్’ నుంచి ‘ఆహా!’గా మార్చేస్తాయి.

### ఫోనుకి బుజ్జి ఏసీ!

సమ్మర్‌లో గేమ్స్ ఆడుతున్నప్పుడు లేదా వీడియోలు చూస్తున్నప్పుడు మీ ఫోన్ వేడి పెనంలా మారిపోతుందా? అయితే మీ ఫోన్ చల్లబరచడానికి వచ్చేసింది ఈ మొబైల్ కూలింగ్ ప్యాడ్! ఇది మామూలు ఫ్యాన్ కాదు, ఇందులో ఉన్న అడ్వాన్స్ సెమీ కండక్టర్ టెక్నాలజీ మీ ఫోన్ టెంపరేచర్‌ను కేవలం సెకన్లలోనే తగ్గించేస్తుంది. అంటే బయట ఎండలు మండిపోతున్నా, మీ ఫోన్ మాత్రం వింటర్ వాతావరణంలో ఉన్నట్టే చిల్ అవుతుంది! దీనికి ఉన్న ఎల్‌ఈడీ డిస్‌ప్లే ఫోన్ ఎంత చల్లగా ఉందో ఎప్పటికప్పుడు చూపిస్తుంది. పైగా ఇందులోని మ్యాగ్నెట్ ఫీచర్ వల్ల ఫోన్ వెనుక సులభంగా అతుక్కుపోతుంది, మీరు గంటల తరబడి గేమింగ్ చేసినా లేదా లైవ్ స్ట్రీమింగ్ చేసినా ఫోన్ హ్యాంగ్ అవ్వదు, బ్యాటరీ కూడా వేడెక్కదు. ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్.. ఏదైనా సరే, సెట్ అయిపోతుంది. ధర రూ. 700 మాత్రమే!

### మ్యాజిక్ గ్లాసెస్!

ఫోన్ చూసి చూసి మీ కళ్లు ‘ఫ్రై’ అయిపోతున్నాయా? బయటకి వెళ్దామంటే సూర్యుడు సెగలతో సినిమా చూపిస్తున్నాడా? ఇలా ఒకేసారి కళ్లకు రక్షణ, మైండ్‌కి రిలాక్సేషన్ ఇచ్చేందుకు వచ్చేసింది ఈ స్మార్ట్ బ్లూటూత్ గ్లాసెస్! ఇందులో ఇన్--బిల్ట్ స్పీకర్లు కూడా ఉన్నాయి. అంటే మీరు కళ్లజోడు పెట్టుకుంటే చాలు, పక్కన ఎవరికీ వినిపించకుండా మీ చెవుల్లో మ్యూజిక్ వినిపిస్తుంది. ఫోన్ తీయకుండానే కాల్స్ కూడా మాట్లాడేయొచ్చు. సాంగ్స్ మార్చుకోవచ్చు. ఇక ఇందులో ఉన్న ఫోటోక్రోమిక్ లెన్సులు ఇంట్లో ఉన్నప్పుడు బ్లూ లైట్ నుంచి, అదే అడుగు బయట పెట్టగానే సెకన్లలో కూలింగ్ గ్లాసెస్‌లా మారి కళ్లకు రక్షణ ఇస్తాయి. పైగా వర్షం పడినా, చెమట పట్టినా ఏమీ కాకుండా దీనికి వాటర్ రెసిస్టెన్స్ కూడా ఉంది. ధర రూ. 1,200 మాత్రమే!

### మంచు కురిపించే గొడుగు!


బయట ఎండలు మండిపోతుంటే.. గొడుగు పట్టుకున్నా సెగలు తగులుతూ చిరాగ్గా ఉందా? అయితే మీ పర్సనల్ ఏసీలాంటి ఈ బీఎన్ఎఫ్ సన్ అంబ్రెల్లాని చూస్తే మీరు ఫిదా అయిపోతారు! దీని లోపల ఒక బుజ్జి ఫ్యాన్ ఉండటమే కాకుండా, ఇది చల్లని నీటిని మంచులా చల్లుతుంది. అంటే ఎండలో వెళ్తున్నా, మీ గొడుగు కింద ఒక చిన్న మంచువాన కురుస్తుంది. కేవలం నాలుగు ఏఏ బ్యాటరీలు ఉంటే చాలు.. గాలికి తిరగబడని విండ్‌ప్రూఫ్ డిజైన్‌తో, అటు గాలిని.. ఇటు మంచు జల్లులను మీకు అందిస్తుంది. ఫ్రెండ్స్‌కి గిఫ్ట్ ఇవ్వడానికి కూడా ఇది ఒక అదిరిపోయే ఆప్షన్. ధర రూ. 5,900.

# సెమీకాన్ మార్కెట్ 300 బిలియన్ డాలర్లు

## 2035 నాటికి మార్కెట్ అంచనా

## ఏఐ, డేటా సెంటర్స్ వృద్ధి దన్ను

## డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీ సెమీకండక్టర్ల మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు పెరిగి 120 బిలియన్ డాలర్లకు చేరనుంది. అలాగే 2035 నాటికి 300 బిలియన్ డాలర్ల స్థాయికి వృద్ధి చెందనుంది. కృత్రిమ మేధ వినియోగం పెరుగుతుండటం, ఆటోమోటివ్ పరిశ్రమ వృద్ధి చెందుతుండటం, డేటా సెంటర్లు విస్తరిస్తుండటం తదితర అంశాలు ఇందుకు దన్నుగా నిలవనున్నాయి. టెక్నాలజీ, మీడియా, టెలికమ్యూనికేషన్స్ భవిష్యత్తుపై డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రస్తుతం 90 శాతం సెమీకండక్టర్లను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే, 2035 ఆఖరు నాటికి దేశీ డిమాండ్‌లో 60 శాతం చిప్సను స్థానికంగానే ఉత్పత్తి చేసుకోనుంది. ‘భారత్‌లో సెమీకండక్టర్ మార్కెట్ 2024--25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 45--50 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా, గత మూడేళ్లుగా వార్షికంగా 20 శాతం మేర వృద్ధి చెందుతోందని అంచనా. ఈ నేపథ్యంలో ఏఐ, ఆటోమోటివ్స్, డేటా సెంటర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ ఊతంతో 2030 నాటికల్లా 120 బిలియన్ డాలర్లకు, 2035 నాటికి 300 బిలియన్ డాలర్లకు చేరొచ్చు‘ అని డెలాయిట్ పేర్కొంది. దేశీయంగా సెమీకండక్టర్ల డిమాండ్‌లో మొబైల్ ఫోన్లు, ఆటోమోటివ్, కంప్యూటింగ్, డేటా సెంటర్లలాంటి సెగ్మెంట్ల వాటా 70 శాతం పైగా ఉండనుంది.

### ఐదేళ్లలో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ..

ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద ఇప్పటికే 10 ప్రాజెక్టుల్లోకి 19 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. వీటిలో ఎనిమిది ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ ..టెస్ట్ (ఓఎస్ఏటీ) ప్లాంట్లు, ఒక సెమీకండక్టర్ ఫ్యాబ్ ఉన్నాయి. సుమారు 20--25 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో మరో 18--20 ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయి. ‘వచ్చే ఐదేళ్లలో భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమలోకి మరో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రావొచ్చు. అలాగే 2030--2035 మధ్య ఇంకో 75--80 బిలియన్ డాలర్లు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ వ్యవస్థ మరింతగా విస్తరిస్తుంది‘ అని నివేదిక వివరించింది.

### భారీగా ఉద్యోగాలు..

సెమీకండక్టర్ల వ్యవస్థ విస్తరించడంతో భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన కూడా జరగనుంది. 2035 నాటికి పరిశ్రమలో సుమారు 20 లక్షల ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ఇందులో 30% ఉద్యోగాలు తయారీ కార్యకలాపాల్లో, 30% డిజైన్ సర్వీసుల్లో, మిగతా 40 శాతం ఇతరత్రా విభాగాల్లోనూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమ ఏటా 4,00,000--5,00,000 మందికి పరిశ్రమ సంబంధిత కోర్సులు, నైపుణ్యాల్లో శిక్షణనివ్వాల్సి ఉంటుందని నివేదిక వివరించింది. అయితే, ఈ సానుకూల పరిణామాలన్నీ కూడా వ్యూహాలను సరిగ్గా అమలు చేయడంపైనే ఆధారపడి ఉంటాయని వివరించింది. స్థలం, యుటిలిటీలు, మౌలిక సదుపాయాలకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేసేందుకు కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే, వార్షికంగా బడ్జెట్లో కేటాయింపులు, నిర్దిష్ట కాలపరిమితితో కూడుకున్న ప్రోత్సాహక స్కీములకే పరిమితం కాకుండా నిధుల లభ్యతపరంగా కచ్చితత్వం ఉండేలా జాతీయ స్థాయి ప్రోగ్రాంను రూపొందించాలని సూచించింది.

# ఇంధన భద్రతకు ‘సౌర’ భరోసా




ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, గల్ఫ్ రీజియన్‌లో మారుతున్న పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ ఎంత సున్నితమైందో మరోసారి గుర్తుచేశాయి. శిలాజ ఇంధనాల దిగుమతులపై భారీగా ఆధారపడే భారతదేశం వంటి దేశానికి ఇంధన భద్రత అనేది కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాదు, అది ఒక వ్యూహాత్మక ప్రాధాన్యత. ఈ నేపథ్యంలో సౌరశక్తి వినియోగాన్ని గరిష్ట స్థాయికి చేర్చుకోవడమే మన ముందున్న ఏకైక మార్గం.

### దశాబ్ద కాలంలో ఇలా..

గడిచిన పదేళ్లలో భారత్ సౌరశక్తి రంగంలో అసాధారణ వృద్ధిని సాధించింది. భారీ సోలార్ పార్కులు, రూఫ్-టాప్ ఇన్‌స్టాలేషన్ల ద్వారా దేశీయ సోలార్ పవర్ సామర్థ్యం 130 గిగావాట్లకు చేరుకుంది. అయితే, సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ ఆ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి.

భారీ ప్రాజెక్టులు.. వికేంద్రీకృత వ్యవస్థ

భారీ సోలార్ ప్లాంట్లు (ఎల్ఎస్ఎస్) తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ వాటికి ప్రధాన అడ్డంకి ట్రాన్స్‌మిషన్ (సరఫరా) వ్యవస్థ. మారుమూల ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను నగరాలకు చేరవేయడానికి భారీ వ్యయంతో కూడిన కారిడార్లు అవసరం. దీనివల్ల విద్యుత్ నష్టాలు పెరగడం, మౌలిక సదుపాయాల కల్పనలో ఆలస్యం కారణంగా విద్యుత్ తరలింపు నిలిచిపోతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ‘పీఎం సూర్య ఘర్’ వంటి పథకాలు గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ ఎక్కడైతే ఉత్పత్తి అవుతుందో అక్కడే వినియోగిస్తున్నారు. దీనివల్ల గ్రిడ్‌పై ఒత్తిడి తగ్గుతుంది.

### గ్రిడ్ నిర్వహణలో సాంకేతిక ఇబ్బందులు



సాధారణంగా విద్యుత్ గ్రిడ్లు ఒకే దిశలో (పవర్ ప్లాంట్ నుంచి వినియోగదారుడికి) ప్రవహించేలా రూపొందించబడ్డాయి. కానీ రూఫ్-టాప్ సోలార్ వల్ల విద్యుత్ రెండు వైపులా ప్రవహిస్తుంది. దీనివల్ల గ్రిడ్ అస్థిరతకు దారితీసే ప్రమాదం ఉంది. సంపన్న వినియోగదారులు సోలార్ వైపు మళ్లడంతో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు నష్టపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని రాష్ట్రాలు అదనపు ఛార్జీలు విధిస్తూ సోలార్ వినియోగాన్ని పరోక్షంగా నిరుత్సాహ పరుస్తున్నాయనే వాదనలున్నాయి.

### సవాళ్లు - పరిష్కారాలు

సౌర విద్యుత్ ఉత్పత్తి మధ్యాహ్నం వేళలో గరిష్టంగా ఉంటుంది, కానీ ఆ సమయంలో గృహాల్లో వినియోగం తక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో డిమాండ్ పెరిగినప్పుడు సౌర ఉత్పత్తి ఉండదు. దీనినే అంతర్జాతీయంగా ‘డక్ కర్వ్’ సమస్య అంటారు. దీనిని అధిగమించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. పగటిపూట మిగిలిన విద్యుత్‌ను భద్రపరిచి రాత్రి వేళల్లో వాడుకోవాలి. విద్యుత్ సమృద్ధిగా ఉన్న సమయంలో రేట్లు తగ్గించి వినియోగదారులను ఆ సమయంలోనే ఎక్కువ విద్యుత్ వాడేలా ప్రోత్సహించాలి.


### సరికొత్త వ్యూహం.. సోలార్, ఈవీ అనుసంధానం

ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కొరత. ప్రభుత్వం పీఎం-డ్రైవ్ పథకం ద్వారా ఛార్జింగ్ స్టేషన్లను విస్తరించాలని చూస్తోంది. సగటున ఒక ఇంటిపై ఉండే 3 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ నుంచి వచ్చే మిగులు విద్యుత్ తక్కువగా ఉండొచ్చు. కానీ ఒక అపార్ట్‌మెంట్ లేదా కాలనీలోని ఇళ్లన్నీ కలిపి ఆ మిగులు విద్యుత్‌ను అక్కడే ఉండే పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లకు మళ్లించవచ్చు. తూత్తుకుడిలోని వీవోసీ పోర్ట్ ఇప్పటికే ఈ నమూనాను విజయవంతంగా అమలు చేస్తోంది. స్థానిక సౌర విద్యుత్‌ను అక్కడే ఈవీ వినియోగానికి అనుసంధానించడం ద్వారా భారీగా ఖర్చు తగ్గించుకున్నారు. భారతదేశ ఇంధన భవిష్యత్తు సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాల అనుసంధానంలోనే ఉంది. డిస్కంలు సోలార్‌ను ఒక ముప్పుగా కాకుండా ఒక అవకాశంగా భావించి స్మార్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. అప్పుడే నిజమైన ఇంధన స్వయంసమృద్ధిని సాధించగలం.

# ‘అసలుకు అచ్చుగుద్దినట్లు చేస్తే ఊరుకోం’

## సీడ్యాన్స్ 2.0ను నిలిపేసిన చైనా

## కాపీరైట్ నిబంధనల ఉల్లంఘనలే కారణం




**ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్, క్యాప్‌కట్ వంటి యాప్‌లతో సంచలనం సృష్టించిన చైనా కంపెనీ ‘బైట్‌డ్యాన్స్’కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రతిష్టాత్మకమైన ఏఐ వీడియో జనరేషన్ మోడల్ ‘సీడ్యాన్స్ 2.0’ గ్లోబల్ లాంచ్‌ను కంపెనీ నిరవధికంగా నిలిపివేసింది. హాలీవుడ్ అగ్రశ్రేణి నిర్మాణ సంస్థల నుంచి కాపీరైట్ ఉల్లంఘన నోటీసులు రావడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.**

### వివాదానికి కారణం ఇదే..

సీడ్యాన్స్ 2.0 సృష్టించే వీడియోలు అచ్చం హాలీవుడ్ భారీ బడ్జెట్ చిత్రాలను తలపిస్తున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన కొన్ని క్లిప్స్ చిత్ర పరిశ్రమను విస్మయానికి గురిచేశాయి. అందులో హాలీవుడ్ నటులు బ్రాడ్ పిట్, టామ్ క్రూజ్ మధ్య జరిగిన పోరాట దృశ్యాలు రియలిస్టిక్‌గా ఉన్నాయి. ఐకానిక్ క్యారెక్టర్లుగా పేరున్న స్పైడర్ మ్యాన్, వెనమ్ వంటి సూపర్ హీరోలతో పాటు ప్రముఖ యానిమేషన్ క్లిప్‌లను ఈ ఏఐ మోడల్ అత్యంత నాణ్యతతో సృష్టించింది. దాంతో తమ మేధో సంపత్తిని అనుమతి లేకుండా ఈ మోడల్‌కు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించారని హాలీవుడ్ స్టూడియోలు మండిపడుతున్నాయి.

### హాలీవుడ్ దిగ్గజాల ధ్వజం

ప్రముఖ నిర్మాణ సంస్థ డిస్నీ గత నెలలోనే బైట్‌డ్యాన్స్‌కు ‘సీజ్ అండ్ డెసిస్ట్’ (నిలిపివేత) లేఖను పంపింది. తమ కంటెంట్‌ను అనుమతి లేకుండా వాడుకున్నారని డిస్నీ ఆరోపించింది. మరోవైపు, పారామౌంట్ స్కైడాన్స్ సైతం రంగంలోకి దిగింది. ‘స్టార్ ట్రెక్, ది గాడ్ ఫాదర్, సౌత్ పార్క్ వంటి మా ఐకానిక్ చిత్రాల హక్కులను బైట్‌డ్యాన్స్ ఉల్లంఘించింది’ అని పారామౌంట్ స్పష్టం చేసింది. సీడ్యాన్స్ 2.0 ప్రస్తుతం చైనాలో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకింగ్, ఇ-కామర్స్, అడ్వర్టైజింగ్ రంగాల్లో విప్లవాత్మక మార్పుల కోసం రూపొందించారు. ఒకవేళ ఇది గ్లోబల్ మార్కెట్లోకి వస్తే హాలీవుడ్ ఉనికికే ప్రమాదమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్




న్యూఢిల్లీ : సోమవారం లోక్‌సభలో కార్పొరేట్ చట్టాల (సవరణ) 2026 బిల్లును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. సమగ్ర పరిశీలన కోసం ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలన్న తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు పరిమిత బాధ్యత భాగస్వామ్య చట్టం 2008, కంపెనీల చట్టం 2013లకు మరిన్ని సవరణలను కోరుతోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను వివరించే ఫైనాన్స్ బిల్లు 2026ను కూడా పరిశీలన కోసం ఆర్థికమంత్రి ప్రవేశపెట్టనున్నారు. కాగా, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టడానిన కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ వ్యతిరేకించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245-246ను ఉల్లంచి ఈ బిల్లులో ముఖ్యమైన శాసన విధులను మితిమీరి అప్పగించారు. కంపెనీల వర్గీకరణ, మినహాయింపులు, పాటించాల్సిన నిబంధనల నిర్ధారణ, కార్పొరేట్ సామాజిక బాధ్యతకు సంబంధించిన పరిమితి, ఆడిట్ బాధ్యతలు, జరిమానాల చట్రాలు వంటి కీలక విధానపరమైన అంశాలను తగిన శాసన మార్గదర్శకత్వం లేకుండా అనుబంధ శాసనలకు వదిలివేశారని మనీష్ తివారీ విమర్శించారు.

## ప్రపంచంలో 1970ల నాటికన్నా తీవ్రమైన చమురు సంక్షోభం



సిడ్నీ : 1970ల నాటి రెండు సంక్షోభాల కన్నా తీవ్రమైన చమురు సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) చీఫ్ ఫతిహ్ బిరోల్ హెచ్చరించారు. కాన్‌బెర్రాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఆస్ట్రేలియాలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభం, 1973, 1979 నాటి చమురు సంక్షోభాలు మరియు 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఫలితంగా తలెత్తిన గ్యాస్ కొరతను కూడా మించిపోయిందని అన్నారు. వాస్తవ పరిస్థితుల ప్రకారం.. ఈ సంక్షోభం ప్రస్తుతం రెండు చమురు సంక్షోభాలు మరియు గ్యాస్ పతనం కలిసినట్లుగా ఉందని అన్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం మరియు ఇంధన సౌకర్యాలపై జరిగిన దాడుల కారణంగా ప్రపంచ చమురు సరఫరా రోజుకి సుమారు 11 మిలియన్ బ్యారెళ్ల (బిపిడి) మేర తగ్గిందని, ఇది 1970ల నాటి రెండు సంక్షోభాల కొరత కంటే రెట్టింపును దాటిందని బిరోల్ పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన అనంతరం ఏర్పడిన 75 బిలియన్ క్యూబిక్ మీటర్ల కొరతతో పోలిస్తే, లిక్విడ్ సహజవాయువు (ఎల్‌ఎన్‌జి) సరఫరా సుమారు 140 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర తగ్గిందని అన్నారు. తొమ్మిది దేశాల్లోని సుమారు 40 చమురు సౌకర్యాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని, వీలైనంత త్వరగా ఈసమస్య పరిష్కారమౌతుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. అవసరమైతే వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాల్సిందిగా పలు దేశాలతో తాను చర్చిస్తున్నానని అన్నారు. అయితే ఈ సంక్షోభానికి ఏకైక అత్యంత ప్రధానమైన పరిష్కారం హోర్ముజ్ జలసంధిని తెవరడమేనని స్పష్టం చేశారు.

## కెన్యాలో వర్షాలు వరదల వల్ల 80 మందికిపైగా మృతి



నైరోబి : కెన్యాలో వర్షం బీభత్సం సృష్టించింది. వర్షాలు వరదల వల్ల 81 మంది మృతి చెందారని కెన్యా నేషనల్ పోలీస్ సర్వీస్ (ఎన్‌పిఎస్) ఆదివారం వెల్లడించింది. ఈ వర్షాలకు అత్యధికంగా దేశ రాజధాని నైరోబి తీవ్ర ప్రభావితమైంది. నైరోబిలో అత్యధిక ప్రాణ నష్టం జరిగింది. ఈ వర్షాలకు నైరోబిలో 37 మంది చనిపోయారు. ఇక తూర్పు ప్రాంతంలో 21, తీర ప్రాంతంలో 5, న్యాంజా ప్రాంతంలో 7, రిఫ్ట్ వ్యాలీలో 8, కెన్యాలోని మధ్య ప్రాంతంలో 3 మరణాలు సంభవించాయని ఎన్‌పిఎస్ ప్రకటన పేర్కొంది. కాగా, వరదల వల్ల పలు ప్రాంతాల్లో రోడ్లు, మార్కెట్లు, రహదారులు, నీరు, విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. 2,690 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే 48 గంటల్లో కూడా నైరోబి, కెన్యా మధ్య, తూర్పు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కెన్యా వాతావరణ శాఖ (కెఎండి) హెచ్చరించింది.

## కుకీజోచైర్మన్‌పై సాయుధ దుండగుల దాడి..
# భద్రతా దళాల కాల్పులు



ఇంఫాల్ : మణిపూర్‌లోని కుకీజో కమ్యూనిటీ చైర్మన్ హెచ్.థాంగ్లెట్‌పై దాడికి యత్నించిన సాయుధ దుండగలపై కాల్పులు జరిపినట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల ప్రకారం.. మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైర్మన్ నివాసంలో ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపిస్తూ ఆదివారం మధ్యాహ్నం ఆయుధాలు ధరించిన కొందరు యువకులు ఆయన నివాసంపై రాళ్లు రువ్వడంతో పాటు లోపలికి చొరబడేందుకు యత్నించారు. భద్రతా దళాలు టియర్‌గ్యాస్ ప్రయోగించి, వారిని చెదరగొట్టాయి. వెనక్కి వెళ్లిన దుండుగులు ఆదివారం రాత్రి తిరిగి చైర్మన్ నివాసంలోకి చొరబడేందుకు యత్నించగా, వారిని అడ్డుకునేందుకు కాల్పులు జరిపినట్లు భద్రతా దళాలు పేర్కొన్నాయి. చురాచంద్‌పూర్ జిల్లా సమీపంలోని తుయిబాంగ్ ప్రాంతంలో కొందరు ఆందోళనకారులు టైర్లను తగులబెట్టారని, టియర్‌గ్యాస్‌తోవారిని చెదరగొట్టారని అన్నారు.

## అది భస్మాసుర హస్తంగా మారింది: హరీష్‌రావు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మాయమాటలతో రైతులను మభ్యపెడుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతుల పాలిట అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసాను రూ.15 వేలకు ఎప్పుడు పెంచుతారో చెప్పాలని నిలదీశారు. తెలంగాణఅసెంబ్లీలో హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు తీరుపై విమర్శలు గుప్పించారు. 'కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని బడ్జెట్‌లో చెబుతున్నారు. ఈ ప్రభుత్వం రూ.19 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టింది. రాష్ట్రమంతా రైతు రుణమాఫీ అమలు కాలేదు. రైతుల పాలిట అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారింది. రైతు రుణమాఫీ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఏ నియోజక వర్గంలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. రుణమాఫీ అమలు పూర్తయిపోయిందని ప్రభుత్వం చెబుతోంది. ఏ గ్రామం వెళ్లినా తమకు రుణమాఫీ కాలేదని రైతులు చెబుతున్నారు. ఆత్మహత్యలు ఆగాలని కేసీఆర్ రైతు బంధును ప్రవేశపెట్టారు. ఎన్ని విపత్తులు వచ్చినా రైతు బంధును కేసీఆర్ ఆపలేదు. మేము ఒక్క సీజన్ కూడా రైతు బంధును ఎగ్గొట్టలేదు. నాట్లు వేసే సమయంలో ఇవ్వాల్సిన రైతు భరోసాను కోతల సమయంలో ఇస్తున్నారు. మీరు ఎగ్గొట్టిన రైతు భరోసాను ఎప్పుడు ఇస్తారు? బడ్జెట్ ప్రతులను కాపీ పేస్ట్ చేస్తున్నారు. రాజీవ్ యువ వికాసం అంటూ గత బడ్జెట్ లో రూ.6వేల కోట్లు పెట్టారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. గతసారి యువ వికాసం నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?' అని హరీష్ రావు అన్నారు.

# ది న్యూ అడిక్షన్ ఎకానమీ.. మీ మెదడుపై అదృశ్య యుద్ధం!



ప్రపంచం మొత్తం మీ అరచేతిలో ఉందని మీరు సంబరపడుతున్నారా? కానీ వాస్తవానికి ఆ అరచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోనే మిమ్మల్ని బందీని చేస్తోందని మీకు తెలుసా? సిలికాన్ వ్యాలీలోని టెక్ కంపెనీలు కేవలం సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే తయారుచేయడం లేదు; అవి మన ప్రమేయం లేకుండానే మనల్ని బానిసలుగా మార్చే 'డిజిటల్ డ్రగ్స్'ను డిజైన్ చేస్తున్నాయి. దీనినే నిపుణులు 'అడిక్షన్ ఎకానమీ' అని పిలుస్తున్నారు.

### మీ సమయమే వారి పెట్టుబడి!

సాధారణంగా ఏదైనా వస్తువు కొనాలంటే మనం డబ్బులు చెల్లిస్తాం. కాని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి యాప్స్ మనకు ఉచితంగా సేవలు అందిస్తున్నాయని మనం భ్రమపడుతుంటాం. ఒక వస్తువుకు మీరు డబ్బు చెల్లించడం లేదంటే, అక్కడ మీరే ఒక వస్తువు అని అర్థం. మీ సమయం, శ్రద్ధ, వ్యక్తిగత సమాచారమే వారి పెట్టుబడి. మీరు ఫోన్ చూస్తూ గడుపుతున్న ప్రతి అదనపు నిమిషం ఈ కంపెనీల పాలిట ఒక బంగారు గుడ్డు. మీరు ఎంత ఎక్కువ సమయం స్క్రీన్‌కు అతుక్కుపోతే, ఆ కంపెనీల షేర్ల విలువ అంతగా పెరుగుతుంది. 2026 ముగిసే నాటికి సోషల్ మీడియా యాడ్ మార్కెట్ సుమారు రూ.26 లక్షల కోట్లకు చేరుకోనుందంటే, మన ఏకాగ్రతను వారు ఎంత ఖరీదైన వస్తువుగా మార్చారో అర్థం చేసుకోవచ్చు. మెటా, గూగుల్ వంటి సంస్థలు రోజుకు వేల కోట్లు సంపాదిస్తున్నాయంటే, దానికి ఇంధనం మన మెదడులోని డోపమైన్, మన చేతిలోని సమయమే!

### దిగ్భ్రాంతికర గణాంకాలు

2025--26 నివేదికల ప్రకారం ఇటీవలి గణాంకాలు చూస్తుంటే మనం ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉన్నామో అర్థమవుతుంది. సగటు భారతీయుడు రోజుకు దాదాపు 6.5 గంటల సమయాన్ని ఇంటర్నెట్‌పై గడుపుతున్నాడు. ఇందులో మూడు గంటల కంటే ఎక్కువ సమయం కేవలం వినోదం, సోషల్ మీడియాకే పరిమితం. ఒకప్పుడు మనుషుల్లో పన్నెండు సెకన్లుగా ఉన్న అటెన్షన్ స్పాన్, ఇప్పుడు ఎనిమిది సెకన్లకు పడిపోయింది. ఒక గోల్డెన్ ఫిష్ అటెన్షన్ స్పాన్ తొమ్మిది సెకన్లు. అంటే మనం దానికంటే ఘోరంగా ఉన్నామన్నమాట! రోజుకు ఐదుగంటల కన్నా ఎక్కువ స్క్రీన్ టైమ్ ఉన్న టీనేజర్లలో ఆత్మహత్య ఆలోచనలు లేదా తీవ్రమైన ఒత్తిడి వచ్చే అవకాశం 35 శాతం పెరిగినట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ నివేదిక చెబుతోంది. ఆన్‌లైన్ గేమింగ్ అడిక్షన్ వల్ల 2025లో భారతీయ కుటుంబాలు దాదాపు 50 వేల కోట్ల రూపాయలకుపైగా నష్టపోయినట్లు అంచనా.

### బయటపడటం ఇలా...

ఈ 'అడిక్షన్ ఎకానమీ'లో మీ విలువైన జీవితాన్ని, సమయాన్ని తాకట్టు పెట్టకండి. ఈ రోజే మీ డిజిటల్ ప్రయాణాన్ని నియంత్రించుకోండి. స్మార్ట్‌ఫోన్ కంటే మీ స్మార్ట్‌నెస్ గొప్పదని నిరూపించండి! మీ ఫోన్ స్క్రీన్‌ను రంగులు లేకుండా 'బ్లాక్ అండ్ వైట్'లో మార్చండి. రంగులు లేకపోతే మెదడుకు ఆ దృశ్యాలు ఆకర్షణీయంగా అనిపించవు, తద్వారా ఫోన్ వాడకం 30 శాతం తగ్గుతుంది. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడండి. ఇది కంటి ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, మెదడుకు చిన్న విరామాన్ని ఇస్తుంది. డైనింగ్ టేబుల్, బెడ్రూమ్‌లో ఫోన్‌ను అనుమతించకండి. ముఖ్యంగా నిద్రపోయే గంట ముందు ఫోన్‌ను పక్కన పెట్టడం వల్ల 'మెలటోనిన్' హార్మోన్ ఉత్పత్తి సక్రమంగా జరిగి గాఢ నిద్ర పడుతుంది. మీ ఫోన్లోని సెట్టింగ్స్‌లో 'డిజిటల్ వెల్--బీయింగ్' ఆప్షన్ ద్వారా ప్రతి యాప్‌కు సమయాన్ని కేటాయించుకోండి. సమయం ముగియగానే యాప్ లాక్ అయ్యేలా చూసుకోండి. ఖాళీ సమయం దొరకగానే ఫోన్ తీయకండి. ఆ ఖాళీ సమయాన్ని ఆలోచనల కోసం, ప్రకృతిని గమనించడం కోసం కేటాయించండి. సృజనాత్మకత ఎప్పుడూ ఖాళీ మెదడులోనే పుడుతుంది.

## సైబర్ బాధిత దేశాల్లో రెండో స్థానంలో భారత్
## ఏఐని ఆయుధంగా మలుచుకుంటున్న నేరస్తులు..
## కృత్రిమ మేధ సాయంతో కొత్త తరహా నేరాలకు శ్రీకారం

# అమెరికా తర్వాత మనమే..



పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్, నకిలీ జాబ్ ఆఫర్స్.. తీరు ఏదైనా సైబర్ మోసాలు ఇప్పుడు నిత్యకృత్యం అయ్యాయి. ఇంటర్నెట్ వినియోగం అధికం అవుతున్న కొద్దీ నేరాల సంఖ్య పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సైబర్ మోసాలకు అత్యధికంగా గురవుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో నిలిచిందంటే ముప్పు తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సైబర్ నేరగాళ్ల లక్ష్యంగా ఉన్న దేశాల్లో అమెరికా తర్వాత భారత్ నిలిచింది. భారత్‌లో ఆంగ్లం మాట్లాడే డిజిటల్ వినియోగదారులు అధికంగా ఉండటం, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు వేగంగా విస్తరిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణమని అమెరికాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం మెటా పేర్కొంది. ప్రస్తుతం ఈ ముఠాలు ఒక ప్రొఫెషనల్ వ్యాపార సంస్థల తరహాలో అత్యంత వ్యవస్థీకృతమై పనిచేస్తున్నాయని తెలిపింది. వీరు తమ లక్ష్యిత వ్యక్తులను గుర్తించడానికి, భారీ స్థాయిలో మోసాలకు పాల్పడటానికి సోషల్ మీడియా, మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్, ఇతర డిజిటల్ సాధనాలను ఉపయోగిస్తున్నారని 2026 ప్రథమార్థానికి సంబంధించిన అడ్వర్సరియల్ థ్రెట్ రిపోర్ట్‌లో వెల్లడించింది.

### కోట్లాది ఖాతాలకు చెక్..

కంపెనీ విధానాలను ఉల్లంఘించిన, అలాగే మోసాలు, మోసపూరిత పద్ధతులు అవలంబించిన వ్యక్తులు, ప్రమాదకరమైన సంస్థలకు చెందిన 15.9 కోట్ల పైచిలుకు అడ్వరై?టజింగ్ ఖాతాలను, 1.09 కోట్ల కంటే ఎక్కువ ఫేస్‌బుక్, ఇన్‌స్ట్?రగామ్ ఖాతాలను, 6,00,000 ఫేస్‌బుక్ పేజీలను 2025లో తొలగించినట్టు మెటా ప్రకటించింది. గత ఏడాది మోసపూరిత అడ్వరై?టజింగ్ ఖాతాల్లో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రాకముందే 92% తొలగించినట్టు తెలిపింది.

### కొత్త తరహా మోసాలు..

ప్రజల బలహీనమైన పరిస్థితులను, మానసిక ఆందోళనను ఆసరాగా చేసుకుని కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని మెటా తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి తక్కువ ధరలో అద్దె ఇళ్ల కోసం వెతికే వారిని లక్ష్యంగా చేసుకుని నకిలీ అద్దె ఇళ్ల ప్రకటనలను పోస్ట్ చేసే నెట్‌వర్క్‌లను పరిశోధకులు కనుగొన్నారు. మరో కలవరపరిచే ధోరణి ఏమంటే నకిలీ అంత్యక్రియల లైవ్‌స్ట్రీమ్ మోసాలు. ఇందులో అంత్యక్రియల సేవా నిర్వాహకులుగా నటిస్తూ ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను సైబర్ నేరగాళ్లు సంప్రదిస్తారు. లేని స్మారక సేవలను ప్రత్యక్ష ప్రసారం చేస్తామని చెప్పి అందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని మెటా తెలిపింది.

### సులభంగా నేరాలు..

భారత్‌లో సైబర్ నేరాలకు సంబంధించిన ఆర్థిక నష్టాలు భారీగా పెరిగాయి. 2024లోనే అంచనా వేసిన నష్టాలు రూ.22 వేల కోట్లు దాటాయి. ఇది సైబర్ దాడుల తీవ్రతను నొక్కిచెబుతోంది. ప్రస్తుతం అనేక ఫిషింగ్ మోసాలు ఏఐ ద్వారా రూపొందించిన సందేశాలతో జరుగుతున్నాయి. దీనివల్ల వాటిని గుర్తించడం మరింత కష్టతరంగా మారుతోంది. జెనరేటివ్ ఏఐ వల్ల మోసగాళ్లకు నేరం చేయడం సులభతరమైంది.

### ఏఐ ఆధారిత యాప్స్‌తో..

వాస్తవికమైనవిగా భ్రమించేలా సందేశాలను, నకిలీ ప్రొఫైల్స్‌ను, అత్యంత క్లిష్టమైన ఫిషింగ్ వెబ్‌సైట్స్‌ను సృష్టించడానికి నేరగాళ్లు ఏఐని ఉపయోగిస్తున్నారు. డీప్‌ఫేక్ సాంకేతికత అసలైన కంటెంట్‌కు, మార్చిన కంటెంట్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కనుగొనడం మరింత క్లిష్టతరం చేసింది. అశ్లీల చిత్రాలను రూపొందించే ఏఐ ఆధారిత యాప్స్ వెల్లువెత్తడం కూడా ఒక పెద్ద ముప్పుగా మారింది. ఈ సాధనాలతో వ్యక్తుల సమ్మతి లేకుండా నకిలీ నగ్న చిత్రాలను సృష్టిస్తున్నారు. వీటి ద్వారా వ్యక్తుల గోప్యతకు, వ్యక్తిగత భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగి స్తున్నారు. వీటిని బహిర్గతం చేస్తామంటూ బెదిరించి వేధింపులకు, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటువంటి యాప్స్‌ను అరికట్టడానికి, వీటిని ప్రచారం చేసే లక్షలాది ప్రకటనలను తొలగించామని, ఆ సేవలను ప్రోత్స హించే అనేక ఖాతాలు, నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకున్నామని మెటా నివేదించింది.

### ఆగ్నేయాసియా నుంచి..

భారతీయ వినియోగదారులను లక్ష్యంగా చేసుకున్న అనేక నెట్‌వర్క్‌లు ఆగ్నేయాసియాలోని మయన్మార్, కంబోడియా, లావోస్ వంటి ప్రాంతాల్లో వ్యవస్థీకృత స్కామ్ కేంద్రాల నుంచి పనిచేస్తున్నాయి. మోసగాళ్ల ముఠాలు ఒకే చోట స్థిరంగా ఉండటం లేదు. వీరు నిరంతరం తమ ప్రాంతాలను మారుస్తూనే మోసపూరిత విధానాలను మరింత మెరుగుపరుస్తున్నారని మెటా వెల్లడించింది.

## సెంచరీ(మి.యూ.)కి చేరువలో ఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగం
## మార్చి మొదటి వారంలోనే రికార్డు స్థాయికి చేరిన కరెంట్ వాడకం
## ఈపీడీసీఎల్ పరిధిలో 16 శాతం పెరిగిన విద్యుత్ డిమాండ్
## 34 డిగ్రీల ఉష్ణోగ్రతలే వినియోగ పెరుగుదలకు ఒక కారణం
## గ్యాస్ కొరతతో ఎలక్ట్రిక్ స్టౌలు, ఇండక్షన్‌ల వినియోగం మరో కారణం

# గ్యాస్ తంటాలు.. విద్యుత్ మంటలు



విశాఖపట్నం: ఎక్కడో విదేశాల్లో బాంబు దాడులు జరుగుతుంటేం ఇక్కడ విద్యుత్ మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. సాగర నగరంలో ఒకవైపు భానుడు నిప్పులు చెరుగుతుంటేం మరోవైపు అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ మేఘాలు ఇళ్లల్లో 'విద్యుత్ మంటలు' రేపుతున్నాయి. ఈ అసాధారణ పరిస్థితుల ప్రభావంతో నగరంలో విద్యుత్ వినియోగం గతంలో ఎన్నడూ లేని విధంగా గణనీయంగా పెరిగింది. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కోసం ఓవైపు ఏసీలు, కూలర్లు గిర్రున తిరుగుతుండగాం మరోవైపు యుద్ధం కారణంగా ఏర్పడిన గ్యాస్ కొరతకు ప్రత్యామ్నాయంగా ఇండక్షన్ స్టౌవ్‌ల వినియోగం ఊపందుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో గతేడాదితో పోలిస్తే ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకుంది. గత పది రోజులుగా రోజువారీ వినియోగంలో సుమారు 16 శాతం అదనపు లోడు నమోదవుతోంది.

### మార్చిలోనే మండుతున్న ఎండలు

నగరంలో ఎండల ప్రభావం మంటపుట్టిస్తోంది. నడివేసవి రాకముందే ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం కూడా రికార్డు స్థాయికి చేరుతోంది. గాలిలో ఉష్ణోగ్రతలు 32--34 డిగ్రీల లోపే నమోదవుతున్నా.. ఉక్కబోత మాత్రం 40 డిగ్రీల ప్రభావాన్ని చూపిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వేసవి మరింత ఇబ్బందికరంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజల్లో ఇప్పుడే గుబులు పుట్టిస్తున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందడానికి అంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను విపరీతంగా వినియోగిస్తున్నారు. సాధారణంగా ఈపీడీసీఎల్ పరిధిలో మార్చి నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారం నుంచి విద్యుత్ వాడకం పెరుగుతుంది. కానీ ఈసారి మార్చి మొదటి వారం నుంచే డిమాండ్ గరిష్ట స్థాయికి చేరింది.

### 16 మిలియన్ యూనిట్లు అదనం

ఈపీడీసీఎల్ పరిధిలో మార్చి నెలలో ప్రతి రోజూ సగటున 78 నుంచి 81 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంటుంది. అయితే భానుడి ప్రతాపంతో ఈ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. గత కొద్ది రోజులుగా రోజువారీ సగటు విద్యుత్ వినియోగం కంటే 14 నుంచి 16 మిలియన్ యూనిట్లు అధికంగా నమోదవుతోంది. ప్రతి రోజూ వినియోగం సెంచరీకి (100 మిలియన్ యూనిట్లు) చేరువలో ఉండటం గమనార్హం. ఈ నెల 7వ తేదీన 96.50 మిలియన్ యూనిట్లు, 12వ తేదీన 96.37 మిలియన్ యూనిట్లుగా నమోదుకావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

### 'ఇండక్షన్' వినియోగం పెరుగుదల

విద్యుత్ వినియోగం పెరగడానికి కేవలం ఎండలు మాత్రమే కారణం కాదు.. విదేశాల్లో జరుగుతున్న యుద్ధం కూడా పరోక్షంగా ఈపీడీసీఎల్‌పై భారం వేసింది. యుద్ధం కారణంగా వంటగ్యాస్ సరఫరాలో అనిశ?చతి, పెరిగిన సిలిండర్ ధరల ప్రభావం నేరుగా సామాన్యుడి వంటగదిపై పడింది. చాలామంది వినియోగదారులు వంటగ్యాస్‌కు బదులుగా ఇండక్షన్ స్టౌవ్‌లు, ఎలక్ట్రిక్ స్టౌవ్‌లు, ఇమ్మెర్షన్ హీటర్లను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా గృహ వినియోగంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ఒక్కో ఇంట్లో వినియోగించే ఇండక్షన్ స్టౌవ్‌లు గ్రిడ్‌పై తీవ్రమైన అదనపు భారాన్ని మోపుతున్నాయి.

### అధికారుల కసరత్తు

శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి, ఏలూరు జిల్లాలతో పోలిస్తే విశాఖ నగరంలో డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. సాధారణంగా విశాఖలో ఈ సమయంలో 25 నుంచి 28 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండాలి.. కానీ ఈసారి అది 31 మిలియన్ యూనిట్లు దాటుతోంది. పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. సాయంత్రం వేళల్లో (పీక్ అవర్స్) గరిష్ట డిమాండ్ 4800 మెగావాట్ల మార్కును దాటుతోంది. ఈ పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తలెత్తకుండా తనిఖీలు చేపట్టడంతో పాటు, నిరంతర సరఫరా కోసం గ్రిడ్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు.

### విద్యుత్ పొదుపు పాటించాలి

డిమాండ్ పెరుగుతున్నా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నిరంతరం సర్కిల్స్ వారీగా సమీక్షలు నిర్వహిస్తూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. వినియోగదారులు కూడా అనవసరమైన విద్యుత్ వాడకాన్ని తగ్గించి సహకరించాలి.

# సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్





ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన సమంత రుత్ ప్రభు కెరీర్ ఇప్పుడు మరో కీలక మలుపు తిరిగే దశలో ఉంది. వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలు, మొదటి వివాహం, అనంతర విడాకులు, ఆరోగ్య సమస్యలు, ఆమె సినీ కెరీర్ ను కాస్త నెమ్మదించేలా చేశాయి. అయితే ఇప్పుడు మళ్లీ వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సమంత, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కానీ ఈసారి ఆమె తీసుకుంటున్న నిర్ణయాలు గతానికి భిన్నంగా ఉన్నాయి.

### మా ఇంటి బంగారంకు రాజ్ క్రియేటివ్ ఇన్‌పుట్స్

సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆమె భర్త రాజ్ నిడిమోరు ప్రెజెంటర్‌గా ఉండటమే కాకుండా క్రియేటివ్ ఇన్‌పుట్స్ కూడా ఇస్తున్నట్టు సమాచారం. రాజ్–డీకే జంట ఇప్పటికే అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి ప్రముఖ ఓటీటీ వేదికలపై సక్సెస్‌ఫుల్ వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంతో సమంత కూడా తన కెరీర్ దిశను ఓటీటీ వైపు మళ్లిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది.

### వెబ్‌సిరీస్ కథలపై సమంత ఆసక్తి


ఇటీవల ఆమెను సంప్రదిస్తున్న దర్శకులకు కేవలం సినిమాల కథలు కాకుండా వెబ్ సిరీస్ కాన్సెప్ట్‌లను కూడా తీసుకురావాలని సమంత సూచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇది కేవలం ట్రెండ్‌ను అనుసరించడం మాత్రమే కాకుండా వ్యూహాత్మక నిర్ణయంగా కూడా భావించవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో సిల్వర్ స్క్రీన్ హీరోయిన్లకు తీవ్ర పోటీ ఉంది. పైగా సమంత గతంలో చేసిన గ్లామర్, కమర్షియల్ పాత్రల తరహా పాత్రలను ఇప్పుడు తిరిగి చేయాలనే ఉద్దేశం ఆమెకు లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ వేదికలు మాత్రం కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే స్థలంగా మారాయి. వయస్సు, ఇమేజ్ పరిమితులు లేకుండా విభిన్న పాత్రలను పోషించే అవకాశాలు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' ద్వారా ఇప్పటికే పాన్–ఇండియా స్థాయిలో తన ప్రతిభను చాటుకున్న సమంతకు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మరింత విస్తృతమైన అవకాశాలను అందించగలవు. అంతేకాదు, థియేటర్లలో ఇటీవల స్టార్ హీరోయిన్ల సినిమాలకు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం కూడా ఒక వాస్తవం. ఈ నేపథ్యంలో సమంత తీసుకుంటున్న ఈ కొత్త దారి ఆమె కెరీర్‌కు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించవచ్చు. స్టార్ ఇమేజ్ కంటే కంటెంట్ ఆధారిత పాత్రలను ఎంచుకుంటూ, ఓటీటీ–థియేటర్ మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నంలో సమంత ఉన్నట్టు కనిపిస్తోంది. మొత్తానికి, సమంత రెండో ఇన్నింగ్స్‌ను మరింత ప్లాన్డ్‌గా, వ్యూహాత్మకంగా ఆడేందుకు సిద్ధమవుతోంది.



# ఫ్లాపుల్లో ఉన్న స్టార్ హీరోని బయటపడేసే రియల్ హీరో ఇతడేనా?

అతడు ముసలోడు.. పనైపోయిందని అనుకున్నారు--.. కానీ అతడు లేట్ ఏజ్‌లోను భళ్లూక పట్టు పడుతున్నాడు! బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్లతో మతులు పోయే ట్రీటిస్తున్నాడు. ఇంతకీ ఈ లేటు వయసు ఘాటు హీరో ఎవరో పరిచయం చేయాలా? బాలీవుడ్ వెటరన్.. ది గ్రేట్ సన్నీడియోల్ గురించే ఇదంతా. వరుస సీక్వెల్స్‌తో దుమ్ము లేపుతున్న సీనియర్ హీరో సన్నీడియోల్ ఇటీవలే -బార్డర్ 2-తోను బంపర్ హిట్టు కొట్టాడు. ఇంతకుముందు గద్దర్ 2 అతడి కెరీర్ కంబ్యాక్ అవ్వడానికి బిగ్ బూస్ట్ ఇచ్చింది. పూర్తిగా డియోల్ శకం ముగిసింది! అనుకుంటున్న తరుణంలో కొన్నేళ్ల పాటు బయటి ప్రపంచానికి కనిపించని సన్నీడియోల్.. ఉన్నట్టుండి గద్దర్ 2 తో సక్సెస్ స్ట్రీక్ లోకి దూసుకొచ్చాడు. గద్దర్ 2 చిత్రం 500కోట్ల క్లబ్ లో చేరింది. ఇప్పుడు మరో సీక్వెల్ చిత్రం బోర్డర్ 2 కూడా ఏకంగా 400కోట్లు వసూలు చేయడం ఒక సంచలనం. ఇలాంటి తరుణంలో ఇప్పుడు అతడు నటించిన లాహోర్ సీక్వెల్ -లాహోర్ 1947- విడుదలకు సిద్ధమవుతోంది. లేటు వయసులో దుమ్ము లేపుతున్న స్టార్ హీరో ఈసారి తన స్నేహితుడు అమీర్ ఖాన్ తో కలిసి పని చేస్తుండడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్‌లో ఇప్పుడు అందరి దృష్టి -లాహోర్ 1947-పైనే ఉంది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అతడిని మళ్ళీ ఫామ్‌లోకి వచ్చిన మాస్ హీరో సన్నీ డియోల్ గట్టెక్కిస్తాడా? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. చాశ్రీంశీ =ముః - సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అమీర్ ఖాన్‌కు ఇది చాలా కీలకమైన సినిమా. -లాల్ సింగ్ చడ్డా- ఫ్లాప్ తర్వాత అమీర్ నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లాహోర్ సీక్వెల్ కి రాజ్ కుమార్ సంతోషి దర్శకత్వం వహిస్తుండటంతో దీనిపై మరిన్ని అంచనాలు పెరిగాయి. ఇక సన్నీ డియోల్ - రాజ్‌కుమార్ సంతోషి కాంబినేషన్ (ఘాయల్, ఘాతక్, దామిని) అంటేనే బాక్సాఫీస్ వద్ద ఒక సెన్సేషన్. దానికి అమీర్ ఖాన్ నిర్మాణ విలువలు తోడవ్వడం సినిమాపై భారీ అంచనాలను పెంచింది. గద్దర్ 2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన సన్నీ డియోల్ -బోర్డర్ 2-తోను మరో బ్లాక్ బస్టర్ కొట్టారు. ఇప్పుడు -లాహోర్ 1947- కూడా హిట్ అయితే పీరియడ్ డ్రామాతో అతడు హ్యాట్రిక్ కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమా ఆగస్టు 13న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదల కానుంది. దేశభక్తి నేపథ్యంలో సాగే సినిమాలకు ఆగస్ట్ 15 మంచి సీజన్. -గద్దర్ 2- కూడా ఇదే సమయంలో వచ్చి రికార్డులు సృష్టించింది. అందువల్ల ఇప్పుడు లాహోర్ సీక్వెల్ కూడా ఘనవిజయం సాధిస్తుందని భావిస్తున్నారు. ఈ చిత్రంతో చాలా కాలం తర్వాత ప్రీతి జింటా రీఎంట్రీ ఇస్తుండటం ప్రేక్షకుల్లో మరో ఆకర్షణగా మారింది. విభజన కాలం నాటి ఎమోషనల్ పీరియడ్ డ్రామాలో ప్రీతి పాత్ర ఏమిటన్నది వేచి చూడాలి. అమీర్ ఖాన్ జాతకం మారుతుందా? వరుస బ్లాక్ బస్టర్లతో దూకుడు మీద ఉన్న సన్నీడియోల్.. ఫ్లాపుల్లో ఉన్న తన స్నేహితుడు అమీర్ ఖాన్ జాతకం మార్చేస్తాడని అంతా భావిస్తున్నారు. అమీర్ ఖాన్ లాహోర్ 1947 చిత్రానికి కేవలం నిర్మాతగానే కాకుండా, ఈ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో కనిపిస్తారని టాక్ ఉంది. కంటెంట్ మీద విపరీతమైన పట్టున్న రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహించడం ప్లస్ కాగా, సన్నీ డియోల్ మాస్ ఇమేజ్‌ను సరిగ్గా వాడుకుంటే ఇది అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్‌కు పూర్వ వైభవం తీసుకురావడం ఖాయమని అంచనా వేస్తున్నారు. 60 ప్లస్ వయసులోనూ బ్యాక్ టు బ్యాక్ హిట్లు కొడుతూ డియోల్ సాబ్ నిజంగా ఆదర్శంగా మారారు.

# ఏఐ మార్ఫింగ్ కి చెక్?.. స్పెషల్ ప్లాన్ తో స్టార్ హీరోయిన్స్!



టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్లకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను పర్మిషన్ లేకుండా సోషల్ మీడియాలో ఎక్కువగా యూజ్ చేస్తున్న వేళ.. పలువురు యాక్ట్రెస్ లు కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఎక్స్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ సహాయంతో పిక్స్ ను మార్ఫ్ చేసి వైరల్ చేయడం వారిలో ఆందోళన కలిగిస్తోంది. రీసెంట్ గా కొందరు స్టార్ హీరోయిన్ల ఫోటోలు ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి ట్రెండ్ చేయడం చర్చనీయాంశమైంది. యంగ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ కు సంబంధించిన బికినీ పిక్స్ తోపాటు రష్మిక మందన్న పుష్ప 2 సినిమాలోని సాంగ్స్ స్టిల్స్ ను ఏఐ ద్వారా మార్ఫ్ చేసి కొందరు నెటిజన్లు పోస్ట్ చేశారు. ఫేస్ మాత్రం అదే ఉంచి.. మిగతా పార్ట్స్ కు సంబంధించి మార్పులు చేసి ఫేక్ ఫోటోస్ ను వైరల్ చేయడం.. హీరోయిన్లకు అసౌకర్యానికి గురి చేస్తోంది. దీంతో ఇలాంటి ఘటనలపై పలువురు హీరోయిన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పర్సనల్ రెస్పెక్ట్, ప్రైవసీకి భంగం కలిగేలా మార్ఫింగ్ లు జరుగుతుండటంతో.. అంతా కలిసి రెస్పాండ్ అవ్వాలని భావిస్తున్నారట. అందుకే త్వరలో కొందరు స్టార్ హీరోయిన్స్ అంతా కలిసి ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి, తదుపరి చర్యలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కేవలం పర్సనల్ గా రెస్పాండ్ అవ్వడం కన్నా.. ఒక టీమ్ గా ఏర్పడి అఫీషియల్ గా ప్రభుత్వాన్ని ఆశ్రయించాలని ప్లాన్ చేస్తున్నారట. ఏఐ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టపరమైన రక్షణ కల్పించాలని.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లకు నిబంధనలు పెంచాలని కోరనున్నట్లు సమాచారం. ఇప్పటికే దేశంలో సైబర్ రూల్స్ ఉన్నప్పటికీ.. అవి మార్ఫింగ్ పిక్స్ ను అడ్డుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే సెలబ్రిటీలే కాకుండా సాధారణ మహిళలు కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ఆ అంశంపై పెద్ద ఎత్తున చర్యలు అవసరమని సినీ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరోయిన్లు ముందుకు వచ్చి పోరాటం చేస్తే...

ఇతరులకు కూడా రక్షణ కలిగే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారట. ఏదేమైనా ఇప్పుడు ఆ విషయంపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం అన్ని రంగాలను ఏలుతున్న ఏఐ టెక్నాలజీ అభివృద్ధి ఎంత ఉపయోగకరమో.. దాని దుర్వినియోగం అంత డేంజర్ అని ఇప్పటికే పలు ఘటనలు ప్రూవ్ చేశాయి. ఇప్పుడు పర్సనల్ రెస్పెక్ట్ ను కాపాడుకునేందుకు పలువురు హీరోయిన్లు తీసుకునే చర్యలపై సినీ వర్గాలతో పాటు అభిమానుల్లో కూడా ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఆ విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్న కల్యాణ్‌రామ్!



కెరీర్ ప్రారంభం నుంచి న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేస్తూ వస్తున్నారు హీరో నందమూరి కల్యాణ్ రామ్. ఈ ప్రయాణంలో బ్లాక్ బస్టర్ హిట్‌లతో పాటు భారీ డిజాస్టర్లని కూడా చవి చూశారు. అయినా సరే కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడం మాత్రం ఆపలేదు. అతనొక్కడే, హరే రామ్, పటాస్ వంటి సినిమాలతో టాలెంటెడ్ డైరెక్టర్స్‌ని ఇండస్ట్రీకి అందించారు. కల్యాణ్ రామ్ పరిచయం చేసిన అనిల్ రావిపూడి ఇప్పుడు వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంటూ హిట్ మెషీన్ అనిపించుకుంటున్నారు. చాశ్రీంశీ =ముః - ఫ్లాపుల్లో ఉన్న స్టార్ హీరోని బయటపడేసే రియల్ హీరో ఇతడేనా? ఇదే తరహాలో మరి కొంత మంది డైరెక్టర్లని పరిచయం చేశారు కానీ పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఫ్లాపులు ఎదుర్కోవాల్సి వచ్చింది. -బింబిసార-తో వశిష్టని దర్శకుడిగా పరిచయం చేసి సూపర్ హిట్ అందుకున్నారు. మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఆ తరువాత కూడా ముగ్గురు కొత్త డైరెక్టర్లని పరిచయం చేస్తూ కల్యాణ్ రామ్ చేసిన ప్రయోగాలు -అమిగోస్-, ది డెవిల్, అర్జున్ సన్నాఫ్ వైజయంతీ తీవ్ర నిరాశకు గురి చేశాయి. సక్సెస్ అవుతాయని కల్యాణ్ రామ్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టలేకపోయాయి. చాశ్రీంశీ =ముః - రణ్ వీర్ (శ) హృతిక్ రోషన్.. ఎవరు బెస్ట్ డాన్? దీంతో దాదాపు ఏడాది బ్రేక్ ఇచ్చిన కల్యాణ్ రామ్ మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్నాడు. ఈ సారి కూడా మరో కొత్త దర్శకుడికి అవకాశం ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. కల్యాణ్ రామ్ దర్శకుడిగా పరిచయం చేయబోతున్నది మరెవరినో కాదు పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించి రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టిన -పుష్ప-, -పుష్ప 2- చిత్రాలకు డైలాగ్స్ అందించిన రైటర్ శ్రీకాంత్ విస్సా ని దర్శకుడిగా పరిచయం చేయబోతున్నాడు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఆల్ రెడీ స్టార్ట్ అయింది. చాశ్రీంశీ =ముః - సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని -అర్జున్ సన్నాఫ్ వైజయంతీ- ముప్పా అశోక్ వర్ధన్ నిర్మించబోతున్నాడని తెలిసింది. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ -పుష్ప-తో పాటు పలు హిట్ సినిమాలకు డైలాగ్స్ అందించిన శ్రీకాంత్ విస్సా చెప్పిన కథ నందమూరి కల్యాణ్‌రామ్‌కు ఎంతగానో నచ్చిందట. గత ఏడాది ఎండింగ్‌లోనే ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినా షూటింగ్‌ని మాత్రం 2026లోనే మొదలు పెట్టాలని ఇన్ని రోజులు ఆగారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక అప్ డేట్‌ని రిలీజ్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. హిట్ సినిమాల రైటర్గా పేరు తెచ్చుకున్న శ్రీకాంత్ విస్సా ఈ సినిమాతో నందమూరి కల్యాణ్ రామ్‌ని మళ్లీ రేస్‌లోకి తీసుకొస్తాడా అన్నది వేచి చూడాల్సిందే.





# మిల్క్ బ్యూటీ వివాదం ముగిసిపోయిందా?



సినీ స్టార్లు, సెలబ్రిటీలు సినిమాల్లో నటిస్తూనే సైడ్ బిజినెస్ కూడా చేస్తుండటం తెలిసిందే. మూవీస్ పరంగా కోట్లల్లో పారితోషికాలు తీసుకుంటున్న స్టార్స్ దానికి మించి కమర్షియల్ యాడ్‌లకు దక్కించుకుంటున్నారు. ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచార కర్తలుగా వ్యవహరిస్తూ తద్వారా ఆయా కంపెనీల సేల్స్ తమ క్రేజ్‌తో పెంచేస్తున్నారు. టాలీవుడ్ టు బాలీవుడ్ వరకు స్టార్ హీరోలు, హీరోయిన్‌లు, ప్రకాష్ రాజ్, సోనూసూద్ లాంటి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లు కూడా బ్రాండ్‌లలో దూసుకుపోతున్నారు. క్రేజీ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా పని చేస్తున్నారు. తెలుగులో రామ్‌చరణ్ నుంచి నాని వరకు పూజా హెగ్డే నుంచి అనుపమ పరమేశ్వరన్ వరకు ఇప్పటికే వివిధ బ్రాండ్‌లకు ప్రచార కర్తలుగా వ్యవహరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో కొంత మంది వివాదాలని ఎదుర్కొంటుంటే మరి కొంత మంది మాత్రం వివాదాలకు దూరంగా ఉంటూ తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇదిలా ఉంటే మిల్క్ బ్యూటీ తమన్నా కూడా ఈ జాబితాలో చేరింది. జపనీస్ కాస్మెటిక్స్ నుంచి ఫాంటా వరకు పదికి పైనే ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచార కర్తగా వ్యవహరిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఖాతాలోకి మరో ప్రతిష్టాత్మకమైన బ్రాండ్ వచ్చి చేరింది. అదే -మైసూర్ సాండల్ సోప్-. గత కొన్ని దశాబ్దాలుగా ప్రముఖ బ్రాండ్‌లలో ఒకటిగా పాపులారిటీని, ప్రజల నమ్మకాన్ని సొంతం చేసుకుని ఇప్పటికీ అదే క్రేజ్‌ని సొంతం చేసుకుని రికార్డు స్థాయిలో సేల్స్ జరుగుతున్న -మైసూర్ సాండల్ సోప్-కు మిల్క్ బ్యూటీ తమన్నా బ్రాండ్ అంబాసిడర్‌గా ఖరారైంది. కర్ణాటక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే -మైసూర్ సాండల్ సోప్- ఉత్పత్తిని ప్రభుత్వమే కొన్ని దశాబ్దాలుగా చూసుకుంటోంది. అలాంటి ఈ ప్రోడక్ట్‌కు తమన్నా అయితే బాగుం టుందని కర్ణాటక ప్రభుత్వం తనని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిం చింది. దీనిపై గత కొంత కాలంగా కర్ణాటకలో నిరసనలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ ప్రాంతానికి చెందని వ్యక్తిని ఎలా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తారని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పలువురు ప్రభుత్వానికి సూచించారు. అయినా సరే ప్రభుత్వం ఎనక్కి తగ్గలేదు. తమన్నానే బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ తాజాగా ఆమెతో కాంట్రాక్ట్‌ని కుదుర్చుకోవడం విశేషం. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉంది. షాహీద్ కాపూర్ -ఓ రోమియో-తో పాటు మరియా ఐపీఎస్, వి శాంతారామ్ బయోపిక్, సిద్దార్థ్ మల్హోత్రా -వీవాన్-, రేంజర్ సినిమాల్లో నటిస్తోంది. ఇందులో షాహీద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ రూపొందిస్తున్న రొమాంటిక్ యాక్షన్ డ్రామా -ఓ రోమియో-లో ఎలాంటి పారితోషికం తీసుకోకుండా తమన్నా నటించిన విషయం తెలిసిందే.

# శక్తిమంతమైన కథలో?

'టాక్సిక్' చిత్రంలో నదియాగా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది అందాల తార కియారా అద్వాణీ. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తున్న ఈమె.. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. "బరేలీ కీ బర్ఫీ', 'పంగా' లాంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీతో ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిందట కియారా. "ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇప్పటికే దీని గురించి కియారా, దర్శకురాలి మధ్య చర్చలు పూర్తయ్యాయి. ఈ చిత్రాన్ని శక్తిమంతమైన మహిళా ప్రాధాన్య కథగా తీర్చిదిద్దనున్నారు. కియారా 'టాక్సిక్' చిత్ర షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .